


# విజయభాను

విజయవాడ, శుక్రవారం 01-09-2017 | VIJAYABHANU DAILY VIJAYAWADA EDITION | సంపుటి : 10 సంచిక : 89 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## తాగేందుకే హెచ్చెల్సీ నీరు

**తాడిపత్రికి అన్యాయం చేయొద్దన్న ఎంపీ**

**శింగనమల ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అసంతృప్తి**

**సాదాసీదాగా సాగిన ఐఏబీ .. వారంలో హంద్రీనీవాకు నీరు**



విజయవాడః తుంగభద్రకు రోజూ 23వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఇంకో వె%పు కృష్ణా బేసిన్‌లోనూ ఆశించిన మేర నీరు వస్తోంది. వారంలోపు శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీనీవా ద్వారా నీరు తెస్తాం. మచ్చుమర్రి వద్ద నాలుగు పంపులు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించామని మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు తెలిపారు. ఏ ప్రాంతానికి అన్యాయం జరగదు. తాగునీటికే అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు. జలవనరులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ఉమ్మడి ప్రణాళిక ప్రకారం తాగునీటికి కేటాయిస్తామన్నారు. ఎక్కడా నీటి చౌర్యం జరగకుండా రెవెన్యూ, పోలీసు, జలవనరుల శాఖల యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తామని మంత్రి పేర్కొన్నారు. మరో మంత్రి కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేనివిధంగా దయనీయ పరిస్థితి నెలకొంది. హెచ్చెల్సీ కింద రిజిస్టర్ ఆయకట్టు ఉన్నా తాగునీటి అవసరాలు తీర్చాల్సిందేనన్నారు.

జిల్లా నీటిపారుదల సలహా మండలి(ఐఏబీ) సమీక్ష సాదాసీదాగా సాగింది. గంటలోపే సమావేశాన్ని ముగించేశారు. దీనికి హాజరైన ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ఎవరి వాదన వారు వినిపించారు. హెచ్చెల్సీ నీటిని తాగేందుకే ఇవ్వాలంటూ చెబుతూనే.. తమ ప్రాంతానికి ఆరుతడి పంటలకు నీరు ఇవ్వాలంటూ మెలిక పెట్టారు. ఆయా ప్రాంతాల రైతుల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చేలా మాట్లాడారు. తుదకు హెచ్చెల్సీ ఎస్‌ఈ శేషగిరిరావు ప్రతిపాదిత కార్యాచరణకే ఐఏబీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆన్‌అండ్ ఆఫ్ విధానానికే మొగ్గు చూపారు. అయితే తుంగభద్ర బోర్డు(టీబీ) నిర్దేశించిన 25 రోజులు ఆన్, 15 రోజులు ఆఫ్ చేసేలా కాకుండా... 30 రోజులు ఆన్, 10 రోజులు ఆఫ్ విధానంపై చర్చించారు. దీన్ని తరువాయి 2లో

**ముంబయిలో భవనం కూలి**

## 10మంది దుర్మరణం

**ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది సహా 15మందికి గాయాలు**

**కొనసాగుతున్న సహాయక చర్యలు**



ముంబయి: ఓ వైపు భారీ వర్షాలతో అతలాకుతలమవుతున్న దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో మరో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. భిండి బజార్ ప్రాంతంలో గురువారం ఓ ఐదంతస్తుల భవనం కుప్ప కూలింది. ఈ ఘటనలో 10 మంది మృతి చెందారు. సమాచారమందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది సహా 15 మంది గాయపడగా.. మరో 25 మందిని రెస్క్యూ సిబ్బంది రక్షించారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. గురువారం ఉదయం 8.30గంటల తరువాయి 2లో



## ఆ డబ్బంతా చట్టబద్ధం కాదు

- నోట్ల రద్దు కుంభకోణం కాదు
- ప్రత్యక్ష పన్నుల ఆదాయం పెరిగింది
- నల్ల ధనం 90 శాతం నిర్మూలనైంది
- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ

దిల్లీ: పెద్దనోట్ల రద్దు ఫలితం వూహించినట్లే సానుకూలంగా ఉందని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ అన్నారు. దీనివల్ల ఆర్థికంగా దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని స్పష్టం చేశారు. అయితే రద్దు తరువాయి 2లో

**ఢిల్లీకి చేరిన**

## తమిళ ప్రకంపన!

- వెంటనే బలపరీక్ష నిర్వహించాలి
- గవర్నర్‌కు ఆదేశాలు ఇవ్వండి
- రాష్ట్రపతిని కోరిన ప్రతిపక్ష సభ్యులు



న్యూఢిల్లీ: తమిళ రాజకీయ ప్రకంప నలు ఢిల్లీకి చేరా యి. సీఎం పళని స్వామికి మెజారిటీ లేదని, తమిళ నాడు అసెంబ్లీని వెంటనే సమావేశ పరిచి.. బల పరీక్ష ను నిర్వ హించా లంటూ ప్రతిపక్ష నేతల బృందం గురువారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసింది. రాష్ట్రపతిని కలిసినవారిలో డీఎంకే, వామపక్షాలు, కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

అన్నాడీఎంకేలో దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు ఎదురుతిరగడంతో పళని సర్కారు మైనారిటీలో పడిన సంగతి తెలిసిందే. సీఎం పళని వర్గానికి మెజారిటీ తరువాయి 2లో

## ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నెరవేర్చాలి

**అధికార, ప్రతిపక్షాలు అగ్రిగోల్డ్ యాజమాన్యాన్ని కాపాడుతున్నాయి**

**రాష్ట్ర అగ్రిగోల్డ్ ఏజెంట్లు, ఖాతాదారుల సంఘం గౌరవాధ్యక్షులు నాగేశ్వరరావు**



విజయవాడ: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని రాష్ట్ర శాసన సభలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెరవేర్చాలని రాష్ట్ర అగ్రిగోల్డ్ ఏజెంట్లు, ఖాతాదారుల సంఘం గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితులను చె%తన్యపర్చేందుకు ఆ సంఘం చేపట్టిన రాష్ట్రవ్యాప్త బస్సు యాత్ర సత్తెనపల్లికి చేరింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో నాగేశ్వరరావు తన ప్రసంగాన్ని తరువాయి 2లో

## అమరావతికి అంతర్జాతీయ ఖ్యాతి



అమరావతి: అమరావతికి అంతర్జాతీయ ఖ్యాతి దక్కింది. అంతర్జాతీయ స్థాయిలో నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని నగరం అమరావతి పేరు మరోమారు మార్మోగనుంది. అమెరికా, ఐరోపా దేశాల్లో త్వరలో జరగనున్న అంతర్జాతీయ బౌద్ధ విశేషాల ప్రదర్శనలో అమరావతి, ఆంధ్రదేశం తరువాయి 2లో




## టేకిట్ ఈజీ



కమల్‌హసన్ రాజకీయాల్లోకి దిగుతున్నారు! ఇక రంజుగా ఉంటుంది రాజకీయం!!

## సహకార కేంద్ర బ్యాంకుల్లో మైక్రో ఏటీఎంలు



విజయవాడ: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందించేందుకు రాష్ట్రంలోనే తొలిసారిగా కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో మైక్రో ఏటీఎంలను ప్రారంభిస్తున్నట్లు ఆప్కాబ్ ఛైర్మన్ పిన్నమనేని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మహాత్మాగాంధీ రోడ్డులోని కేడీసీసీ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో నాబార్డ్ జనరల్ మేనేజర్ రఘుపతి, ఆప్కాబ్ ఎండీ తులసీ ప్రసాద్‌లతో కలసి జిల్లాలోని 50 సహకార సంఘాలకు మైక్రో ఏటీఎంలను పంపిణీ చేశారు. వీటితో పాటు జిల్లాలోని అన్ని సహకార సంఘాలకు సరఫరా చేస్తామని వివరించారు. మైక్రో ఏటీఎం ద్వారా రోజుకు రూ.50వేల వరకు నగదు పంపిణీకి అవకాశం ఉందని ఒక్కో ఖాతాకు రూ.5వేలు పరిమితి విధించినట్లు తెలిపారు. నాబార్డ్ జీఎం రఘుపతి మాట్లాడుతూ నాబార్డ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సౌకర్యం మెరుగుపరిచే కార్యక్రమంలో భాగంగా మైక్రో ఏటీఎంలు అందజేస్తున్నామన్నారు.

ప్రతి ఒక్కరూ నగదు రహిత లావాదేవీలు జరిపేందుకు కృషి చేయాలని కోరారు. ఆప్కాబ్ ఎండీ తులసీప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా జిల్లా మైక్రో ఏటీఎంలు వాడకంలో కృష్ణా జిల్లా ముందుందని తెలిపారు. కార్యక్రమంలో ఆప్కాబ్ జీఎం వి.భానుప్రసాద్, కృష్ణా జిల్లా సహకారబ్యాంకు డీజీఎం ఎన్.రంగబాబు, ఏజీఎం ప్రభ తదితరులున్నారు.

## పాఠశాలల్లో సిలబస్ పూర్తిపై దృష్టి పెట్టండి

ఒంగోలు : ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ మూలంగా పాఠశాలల్లో సిలబస్ పూర్తి చేయడంలో వెనుకబడి ఉంటే, ఆ లోపాన్ని సవరించడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆర్జేడీ శ్రీనివాసరెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి వచ్చిన ఆర్జేడీ- డీఈవో విజయభాస్కర్, ఉప విద్యాశాఖ అధికారులతో వివిధ అంశాలపై మాట్లాడారు. ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసి సిలబస్ ఎంత వరకూ పూర్తయిందో తెలుసుకోవాలని, అవసరమైతే అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అమలు జరిగేలా చూడాలన్నారు. డిజిటల్ బోధన ప్రవేశపెట్టిన పాఠశాలల్లో తరగతులు సక్రమంగా అమలు జరిగేలా చూడాలన్నారు. బదిలీల కౌన్సెలింగ్‌లో తమకు అన్యాయం జరిగిందని కొందరు ఉపాధ్యాయుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఆయా దస్త్రాలను పరిశీలించారు. డీఈవో పూల్‌లో మిగిలి ఉన్న 30 మంది ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లు ఇచ్చే అంశంపై చర్చించారు.

వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఆర్జేడీని కలిసి అర్జీలు అందజేశారు. గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా స్కూల్ అసిస్టెంట్లకు మాత్రమే అవకాశం ఇవ్వాలని కోరుతూ స్కూల్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చింతల సుబ్బారావు, రమణకుమార్ వినతిపత్రం ఇచ్చారు. 1998లో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలుగా సెకండరీ గ్రేడ్ టీచర్లు పదోన్నతులు పొందారని, తర్వాత వారే స్కూల్ అసిస్టెంట్ కేడర్‌కు పదోన్నతులు పొందారన్నారు. ఎల్ఎఫ్ఎల్ కాకుండా స్కూలు అసిస్టెంట్ సీనియారిటీనే పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

## ఇకపై ఎనిమిది రోజులకోసారి తాగునీరు

బళ్లారి : నగర వాసులకు శుభవార్త. ఇక నుంచి ఎనిమిది రోజులకు ఓసారి తాగునీటిని సరఫరా చేయనున్నట్లు మేయర్ గుర్రం వెంకటరమణ ప్రకటించారు. చాలాకాలంగా 15రోజులకు ఓసారి నగరంలో తాగునీటిని సరఫరా చేస్తుండడంతో సామాన్య ప్రజానీకం అష్టకష్టాలు పడుతోంది. వీరి ఇబ్బందులను ద ృష్టిలో ఉంచుకుని, తుంగభద్ర కాలువలకు నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో మేయర్ వెంకటరమణ జలమండలి అధికారులతో కలిసి నగరవాసుల తాగునీటి సరఫరాకు ఆధారమైన మోకా సమీపంలోని తుంగభద్ర జలాశయం కుడి దిగువ(ఎల్లెల్సీ) కాల్వను బుధవారం పరిశీలించారు. కాల్వ నుంచి నీటిని తోడే విషయమై అధికారుల నుంచి మేయర్ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నగర వాసుల అవస్థలను ద ృష్టిలో ఉంచుకుని ఎనిమిది రోజులకోసారి నీటిని సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అల్లీపురం తాగునీటి చెరువు నుంచి మదర్ ట్యాంక్‌కు నీటిని తోడి, అక్కడి నుంచి నగరంలో చాలా ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేసే వాళ్లం. ఇక నుంచి ఎల్లెల్సీ కాల్వ నుంచి నీటిని సంగనకల్లు సమీపంలోని పంపుహౌస్‌కు తోడనున్నట్లు మేయర్ వివరించారు. ఇక్కడి నుంచి నగరంలోని మిల్లర్‌పేట, బిసిలహళ్లి తదితర ప్రాంతాల్లో ఉన్న 13 ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని తోడి, ఆ ట్యాంకుల ద్వారా ప్రజలకు నీటిని అందిస్తామన్నారు. మరో వారం రోజుల్లో ఎనిమిది రోజులకోసారి తాగునీటి సరఫరా ప్రారంభమవు తుందన్నారు. జలమండలి అధికారి గంగాధరగౌడ, కార్పొరేటర్ కరెకోడప్ప తదితరులు పాల్గొన్నారు.

## 'కిస్' ఆదివాసీల పాలిట ఆరాధ్య సంస్థ

రాయగడ : భువనేశ్వర్‌లో ఉన్న కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్(కిస్) ఆదివాసీల పాలిట ఆరాధ్య సంస్థ అని వక్తలు అన్నారు. పురపాలక సంస్థ టౌన్‌హాలులో కిస్ విద్యాలయానికి ఆదివాసీ విశ్వవిద్యాలయ హోదా లభించడంపై ఆనందోత్సవ సభ నిర్వహించారు. అమూల్య రత్నసాహు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ కిస్ విద్యాసంస్థలో జిల్లాకి చెందిన 3,600 మంది చిన్నారులు ఉచితంగా విద్యను అభ్యసిస్తున్నారన్నారు. కిస్ సంస్థ ఆదివాసీ విశ్వవిద్యాలయంగా అవతరిస్తే ఆదివాసీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించగలరన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రోణిసబర్, అప్పలస్వామికద్రక, బసంత ఉలకా, కాశీరాంమాఝి, జిత్తు జకసిక, ఇస్మైల్ సబర్, హరప్రసాద్ హెప్రుక తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం మిఠాయిల పంపిణీ, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి ఆదివాసీలు హాజరయ్యారు.

## భాజపా కార్యవర్గ సమావేశం

బరగఢ్ : బరగఢ్ బిజు పట్నాయక్ టౌన్ హాలులో బుధవారం భాజపా జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు నారాయణ సాహు అధ్యక్షతన జరిగిన సభకు పద్మపూర్ శాసనసభ్యుడు ప్రదీప్ పురోహిత్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. జిల్లాకి చెందిన నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు. జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా భువనేశ్వర్‌లో నిర్వహించే సభకు జిల్లా నుంచి అయిదువేల మంది నాయకులు, కార్యకర్తలు వెళ్లాలని తీర్మానించారు. మోదీ సరికొత్త ఇండియా కోసం క ృషి చేస్తున్నారని కార్యకర్తలంతా అందుకు సహకరించాలని ప్రతిజ్ఞ చేశారు.బూత్ స్థాయిలో పార్టీని పటిష్టం చేయాలని కోరారు. సుభాష్ చౌహాన్, డి.మురళీకృష్ణ, రబిదాస్ పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు.

## దస్త్రాల నిర్వహణ సక్రమంగా లేకపోతే సస్పెన్షన్

### పీడీ పోలప్ప



ఒంగోలు : క్షేత్ర స్థాయిలో ఉపాధిహామీ దస్త్రాల నిర్వహణ సక్రమంగా లేకపోతే సంబంధిత సిబ్బందిని బాధ్యులను చేసి సస్పెన్షన్ చేస్తామని డ్వామా పీడీ పోలప్ప ఉద్యోగులను హెచ్చరించారు. ఉపాధిహామీ పనుల ప్రగతిపై ఏపీవో, ఈసీ, సాంకేతిక సహాయకులతో పీడీ వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో డంపింగ్ యార్డుల నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని, ఎక్కడ్కెనా స్థల సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. పాఠశాలల్లో ఆట స్థలాల అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు.

వర్షాకాలాన్ని ద ృష్టిలో ఉంచుకుని పండ్ల మొక్కల పెంపకం లక్ష్యాలను చేరుకోవాలని వివరించారు. సమావేశంలో డ్వామా ఏపీడీలు భవాని, మీరావలి పాల్గొన్నారు.

## సాంకేతిక ఫలాలు సామాన్యులకు చేరువ కావాలి

కర్నూలు : రాయలసీమ విశ్వ విద్యాలయంలో భౌతికశాస్త్ర ఆచార్యులు పుణ్యశేషుడు పదవి వీరమణ సందర్భంగా ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఆర్‌యూ పరిపాలన భవనంలోని సెనేట్‌హాల్‌లో రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. రీసెంట్ ట్రెండ్స్ అండ్ ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ అంశంపై ఏర్పాటు చేసిన సదస్సును ఆర్‌యూ ఉపకులపతి వై.నరసింహులు ప్రారంభించి బ్రోచర్‌ను విడుదల చేశారు. సతీష్‌ధావన్ అంతరిక్ష పరిశోధన సంస్థ పరిశోధకులు ఆర్. వరప్రసాద్, జాతీయ వైజ్ఞానిక సంస్థ భౌతిక శాస్త్ర ఆచార్యులు ఆర్ఎల్ఎన్ సాయి ప్రసాద్, ఇస్రో శాస్త్రవేత్త రాజారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌యూ ఉపకులపతి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో భౌతిక శాస్త్రం, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పరిశోధనలు కీలకమైనవని, ప్రస్తుతం సాంకేతిక విప్లవం నడుస్తున్న తరుణంలో ప్రాథమిక స్థాయి పరిశోధనలతో భారతదేశం నేటికీ అంతరిక్ష రంగంలో తమదైన పాత్ర పోషిస్తోందన్నారు. సామాన్య మానవుడికి అత్యంత ఉపయోగకరమైన మొబైల్ యాప్, ఆన్‌లైన్ కోర్సులు, సాంకేతిక అభివ ృద్ధి లాంటి రంగాలకు భౌతికశాస్త్ర పరిశోధనలు పునాదులు వేశాయన్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ అంశంతో పరిశోధకులు ముందడుగు వేయడంలో సిద్ధంగా ఉన్నాయన్నారు. అందులో భాగంగానే ఆర్‌యూలో త్రీడీ ప్రింటింగ్ అండ్ స్కానింగ్ టెక్నాలజీ, సౌరవిద్యుత్ కేంద్రంగా మరో ముందడుగు వేయనున్నామన్నారు. యోగి వేమన వర్సిటీ భౌతికశాస్త్ర ఆచార్యులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ వాతావరణం, మార్పులు, అంతరిక్ష పరిశోధన, భౌతికశాస్త్ర అనువర్తనాలు, రిమోట్ సెన్సింగ్ అంశాలపై చర్చించారు. భారతదేశ అంతరిక్ష పరిశోధన అంశంపై వరప్రసాద్, ఫైబర్ ఆప్టికల్ కమ్యూ నికల్ అంశంపై ఆర్ఎల్ఎన్ సాయిప్రసాద్, మధ్యాహ్నం సోలార్ బ్యాటరీలు, అనువర్తనలు అంశంపై ఆచార్యులు ఎం.రాజారెడ్డి, పదార్థ పరిశోధనలో ఉష?గతిక శాస్త్ర పాత్ర అంశంపై ఆర్‌యూ ఆచార్యులు ఎస్.రమణయ్య ప్రసంగించారు. కన్వీనర్ సీవి.కృష్ణారెడ్డి, మహమ్మద్ దాదా, ప్రిన్సిపల్ ఆచార్య శ్రీనివాసరావు, ఆర్.సంజీవ రావు, చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు ఖాదర్, మధుసూధన్ వర్మ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల కోసం పాఠశాలకు తాళం

గంగావతి : ఉపాధ్యాయుల నియామకం కోరుతూ పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేసిన సంఘటన బుధవారం ఆనెగుందిలో జరిగింది. హంపి రహదారిలోని ప్రాథమిక పాఠశాలలో 99 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకటి నుంచి 5 తరగతులు ఉన్నాయి. కానీ ఉపాధ్యాయుడు మాత్రం ఒక్కరే ఉన్నారు. ఐదు తరగతుల విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు పాఠాలు చెప్పాల్సి ఉంది. ఈ పాఠశాలకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉండేవారు. వీరిలో ఒకరు రెండు నెలల కిందట ప్రసూతి సెలవుపై వెళ్లారు. మరో ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై గంగావతి విద్యాశాఖ కార్యాలయానికి పంపారు. దీంతో గత మూడు నెలలుగా ఒక్కరితో నెట్టుకొస్తున్నారు. ఆయన సెలవు పెడితే పాఠశాలకు తాళం వేయాల్సిందే. ఈ సమస్యను ఎస్.డి.ఎం.సి, స్థానిక సంస్థ జనప్రతినిధులు పలుమార్లు బీఈవో ద ృష్టికి తెచ్చినా ఫలితం శూన్యం. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఎస్.డి.ఎం.సి. సభ్యులు పాఠశాలకు తాళం వేశారు. తాలూకా పంచాయతీ సభ్యుడు వై.రమేశ్, గ్రామపంచాయతీ అధ్యక్షురాలు వినూశాషబ్బీర్ వీరికి సంఘీభావం ప్రకటించారు. విషయం తెలిసి ఆనెగుంది వచ్చిన గంగావతి బి.ఇ.ఒ. వీరభద్రయ్య గొండబాళను ప్రజలు నిలదీశారు.

వెంటనే ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. రెండ్రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇవ్వడంతో నిరసన దీక్ష విరమించారు.

ఎస్.డి.ఎం.సి. అధ్యక్షుడు రామకృష్ణ పాల్గొన్నారు.

## ఫలితాల విడుదలలో జాప్యంపై ఆందోళన

బెంగళూరు : విశ్వేశ్వరయ్య సాంకేతిక విశ్వ విద్యాలయంలో (విటియు) నిర్వహిస్తోన్న పరీక్షల ఫలితాలను విడుదల చేయటంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఏబీవీపీ కార్యకర్తలు బుధవారం ధర్నాకు దిగారు. ఆందోళనలో భాగంగా నాగరబావిలోని వీటీయూ ప్రాంతీయ కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించిన ఆందోళనకారులను నియంత్రించేందుకు పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. ఫలితాలను ప్రకటించేందుకు ఐదు నెలలకు పైగా సమయాన్ని తీసుకుంటున్నారని ఆందోళనకారులు ఆరోపించారు. కాగా, వర్సిటీ అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ వీటీయూ పరిధిలోకి వచ్చే కళాశాలల బంద్ సెప్టెంబరు 1న నిర్వహించనున్నామని వేర్వేరు విద్యార్థి సంఘాలు ఇప్పటికే ప్రకటించాయి.

ఆ బంద్‌కు తమ మద్దతు ఉంటుందని ఏబీవీపీ పథాధికారులు తెలిపారు.

## యాదాద్రీశుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : శ్రీలక్ష్మీసమేతుడైన నరసింహుడిని సుప్రభాతంతో మేల్కొలిపిన పూజారులు పండితుల వేదమంత్ర పఠనాల మధ్య హారతిని నివేదించారు. ఆ పర్వంతో నిత్యారాధనలు మొదలయ్యాయి. ప్రతిష్ఠాలయంలో ఉత్సవమూర్తులకు పాలతో అభిషేకం, తులసీ పత్రాలతో అర్చన జరిపాక మండపంలో నిత్యారాధనలు విశేషంగా నిర్వహించారు. శ్రీలక్ష్మి నరసింహుల నిత్యకల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. విష్వక్సేన ఆరాధనతో నిర్వహించిన కల్యాణోత్సవంలో అలంకార మూర్తులను గజవాహనంపై అధిష్ఠింపజేసి సేవోత్సవాన్ని చేపట్టారు.

మహామండపంలో సహస్రనామాలతో కొలుస్తూ అష్టోత్తరం నిర్వహించారు. అష్టోత్తరంలో పలువురు భక్తులు పాల్గొని ఆశీస్సులు పొందారు. అలంకార జోడు సేవోత్సవాన్ని శాస్త్రీయంగా నిర్వహించారు.

# సామాజిక సేవలే రోటరీ లక్ష్యం

సిమిలిగుడ : సామాజిక సేవలే రోటరీక్లబ్‌ల లక్ష్యమని నాల్కో కార్యనిర్వాహక సంచాలకులు దిలీప్‌కుమార్ మహంతి అన్నారు. దమన్‌జోడి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో దమన్‌జోడిలో 'రోటరీ మేకింగ్ ఏ డిఫెరెన్స్' అనే అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. మహంతి ముఖ్య అతిథిగా పాల్గొని సామాజిక సేవలపై ద ృష్టినిలిపి నిరుపేదలకు చేయూతను అందించాలని కోరారు. రోటరీ జిల్లా గవర్నర్ అజయ్ అగ్రవాలా మాట్లాడుతూ రోటరీ సేవలు అంతర్జాతీయస్థాయిలో విస్తరించామని, పోలియో నివారణకు చాలా క ృషి చేస్తున్నామన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు రబిశంకర్ దాస్ అధ్యక్షతనలో సభ్యులు సుజితాపాణి, అమియ్‌కుమార్‌స్వాయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదోతరగతి పరీక్షల్లో ఉత్తీర?త సాధించిన హర్షితా ఆనంద్, మాధవ్ చంద్రరౌత్, ఉత్తమ సేవలు అందించే సామాజిక కేంద్రం సిబ్బంది నిరంజన్‌బారిక్‌లను సత్కరించారు.

క్లబ్ ద్వారా నిర్వహించే చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో అవిభక్త కొరాపుట్ జిల్లాకు చెందిన 24 రోటరీక్లబ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి.



**మొదటి పేజీ తరువాయి**

## అమరావతికి అంతర్జాతీయ ఖ్యాతి

అంశాలపై ప్రత్యేక గ్యాలరీని ఏర్పాటు చేశారు. మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్ ఆవిర్భవించి 150 ఏళ్లు పూర్తికావడాన్ని పురస్కరించుకుని ఈ ప్రదర్శనను నిర్వహించారు. ప్రపంచంలోని ప్రసిద్ధ మ్యూజియాల్లో అమరావతి ఉంది. ఆంధ్ర దేశపు బౌద్ధ విశేషాలను నిర్వాహకులు సేకరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని మ్యూజియాల్లోని అమరావతి, ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన బౌద్ధ సంబంధిత విశేషాలు, కళాఖండాలు, చారిత్రక వస్తువులన్నింటినీ సమీకరించి, ఈ అంతర్జాతీయ ప్రదర్శనలో ఉంచారు.

## ముంబయిలో భవనం కూలి 10మంది మృతి

ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. భవనంలో తొమ్మిది కుటుంబాలు నివసిస్తున్నాయని అగ్నిమాపక విభాగ అధికారులు తెలిపారు. భవనంలో ఓ ప్లేస్కూల్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఉదయమే ఈ ఘటన చోటుచేసుకోవడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. ఈ భవనం 50ఏళ్ల క్రితం నిర్మించారని స్థానికులు చెబుతున్నారు.

కాగా.. ముంబయిలో మంగళవారం భారీ వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. దీంతో వరదలు సంభవించి అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. వరదల కారణంగా ముంబయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. ఇప్పటికే 19 మంది ప్రాణాలు కోల్పోయారు.

## ఢిల్లీకి చేరిన తమిళ ప్రకంపన!

లేకపోయినా.. అసెంబ్లీలో విశ్వాస పరీక్ష నిర్వహించకుండా గవర్నర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, అధికార పార్టీకి అనుకూలంగా ఆయన వైఖరి ఉందని ప్రతిపక్ష సభ్యులు రాష్ట్రపతి దృష్టికి తీసుకొచ్చారు. దినకరన్ వర్గం ఎమ్మెల్యేల తిరుగుబాటు నేపథ్యంలో వెంటనే అసెంబ్లీ సమావేశపరిచి.. బలపరీక్ష నిర్వహించేలా గవర్నర్‌కు ఆదేశాలు ఇవ్వాలంటూ రాష్ట్రపతిని కోరారు.

అనంతరం సీపీఎం నేత ఏచూరి, సీపీఐ నేత రాజా, డీఎంకే నేత స్టాలిన్ తదితరులు మీడియాతో మాట్లాడారు. తమిళనాడులో వెంటనే బలపరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## ఆ డబ్బంతా చట్టబద్ధం కాదు

మూలంగా బ్యాంకుల్లోకి చేరిన డబ్బంతా చట్టబద్ధం అయిపోదని జైట్లీ పేర్కొన్నారు.. రద్దయిన పెద్దనోట్లపై రిజర్వ్ బ్యాంక్ బుధవారం ప్రకటన చేసిన విషయం తెలిసిందే. రద్దయిన నోట్లలో దాదాపు 90శాతం తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థలోకి చేరాయి అని ఆర్‌బీఐ పేర్కొంది. అయితే అదంతా పెద్ద కుంభకోణం అని విపక్షాలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో జైట్లీ ఈ విధంగా స్పందించారు.

రద్దయిన నోట్లనీ బ్యాంకుల్లోకి తిరిగి చేరాయి అంటే.. ఆ సొమ్మంతా చట్టబద్ధమైనది అని అర్థం కాదు. పెద్దనోట్ల రద్దు తర్వాత నల్లధనం పూర్తిగా నిర్మూలన అయిందని ఎవరూ చెప్పలేరు అని జైట్లీ అన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీ అనే అంశాలు ప్రత్యక్ష పన్నుల ఆదాయాన్ని పెంచాయని చెప్పారు. దీనివల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు దీర్ఘకాలంలో ప్రయోజనాలు చేకూరుతాయని.. అందుకే ఎన్ని రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా నోట్ల రద్దు చేపట్టామని పేర్కొన్నారు.

## కుదుటపడుతున్న టెక్సాస్

కారణంగా 31 మంది ప్రాణాలు కోల్పోయారు. 17 మంది కనిపించకుండా పోయారు. వరదల కారణంగా వీధులు, జాతీయ రహదారులు చెరువులను తలపించడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. పరిస్థితిని చక్కదిద్దేందుకు వేలాది మంది సహాయక సిబ్బంది రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. వరదల్లో చిక్కుకున్న 13వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరోవైపు హార్వే తుపాన్ లూసియానా వైపు మళ్లడంతో ఆ రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

## తాగేందుకే హెచ్చెల్సీ నీరు

ఆమోదిస్తూ బోర్డు అంగీకారానికి పంపాలని నిశ్చయించారు. ప్రస్తుతం టీబీ జలాశయంలో ఉన్న 62 టీఎంసీల ప్రకారం హెచ్చెల్సీ వాటాగా వచ్చే 9.5 టీఎంసీలను కేవలం తాగునీటికే కేటాయించాలని నిర్ణయించారు. ముున్ముందు తుంగభద్రలోకి వచ్చే నీటిని బట్టి నిర్దేశిత ప్రాంతాల్లోని ఆరుతడి పంటలకు రక్షక తడులు ఇవ్వడానికి అంగీకరించారు. బుధవారం రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ వీరపాండియన్ అధ్యక్షతన ఐఏబీ వార్షిక సమీక్ష జరిగింది. దీనికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి కాలవ శ్రీనివాసులు, ప్రభుత్వ విప్ యామినీబాల, అనంత, కడప ఎంపీలు దివాకర్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, అనంత, కడప, కర్నూలు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

ఏటా అన్యాయం జరుగుతోంది..

ఐఏబీ సమీక్షలో ప్రథమంగా ఎంపీ దివాకర్‌రెడ్డి తమ అభిప్రాయాన్ని వినిపించారు. తాడిపత్రి ప్రాంతానికి చుక్కనీరు ఇవ్వడం లేదు. ప్రతిసారి అన్యాయం చేస్తూనే ఉన్నారంటూ అక్కసు వెళ్లగక్కారు. ఇంతకంటే ఎక్కువ చెప్పలేను. తన విన్నపాన్ని పరిగణలోకి తీసుకోవాలంటూ కోరారు. హెచ్చెల్సీ పైన ఉండే కాలువల స్లూయిస్‌ను బంద్ చేయాలి. వరి వేయొద్దని రైతులకు గట్టిగా చెప్పాలని సూచించారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ శమంతకమణి, శింగనమల ఎమ్మెల్యే యామినీబాల అసంతృప్తి, ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రాంతానికి ఆయకట్టు ఉంది. గతేడాది చుక్కనీరు ఇవ్వలేదు. శింగనమల చెరువుకు నీరు ఇస్తామని స్వయంగా సీఎం హామీ ఇచ్చారు. కానీ గత కలెక్టర్, ఎస్ఈలు అన్యాయం చేశారంటూ ఆవేదన చెందారు. శింగనమల, తాడిపత్రి ప్రాంతాల కాలువలపై తిరుగుతాం. ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తామని మంత్రి దేవినేని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ గోపాల్‌రెడ్డి మాట్లాడారు. రెయిన్‌గన్ల ప్రస్తావన తెచ్చారు. దీంతో మంత్రి కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ సమస్యపై ఇంజినీర్లకు నివేదిక ఇవ్వండి. అధ్యయనం చేస్తారు. మీకు తగిన పరిజ్ఞానం లేదంటూ ఆగ్రహంతో సమాధానం చెప్పారు.

నీరు ఇవ్వకపోతే ప్రజల్లో తిరగలేం

చిత్రావతి జలాశయంలో చుక్కనీరు లేదు. చాలా ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తింది. పది రోజుల్లో చిత్రావతికి నీరు ఇవ్వకపోతే ప్రజల్లో తిరగలేమని పలువురు ప్రజాప్రతినిధులు తెగేసి చెప్పారు. కడప ఎంపీ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ తాగునీటికి తగినన్ని నీరు ఇవ్వండి. ఆ తర్వాత మిగిలితే ఆరుతడి పంటలకు ఇస్తే మంచిది. తమ ప్రాంతంలో చీనీ పంటకు రక్షక తడులు ఇవ్వాలని కోరారు. ధర్మవరం, పుట్టపర్తి, కదిరి ప్రాంతాల్లో తాగునీటికి తీవ్ర ఇబ్బంది ఉంది. పది రోజుల్లో చిత్రావతికి నీరు ఇవ్వాల్సిందేనని ధర్మవరం, కదిరి ఎమ్మెల్యేలు వరదాపురం సూర్యనారాయణ, చాంద్‌బాషా ప్రస్తావించారు. జిల్లాకు వచ్చే నీటిని సమాన ప్రాధాన్యతలో కేటాయిస్తే మేలని పెనుకొండ ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. తమ ప్రాంతంలో 20 రోజులకే సరిపోతాయి. జీబీసీ ద్వారా నీరు ఇవ్వాలని గుంతకల్లు ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ కోరారు. హెచ్చెల్సీ పరిధిలో పట్టణ, పల్లెలకు తాగునీటికి పుష్కలంగా ఇవ్వండి. ఆ తర్వాత జీబీసీ, కణేకల్లు కింద ఆయకట్టుకు నీరు ఇచ్చేలా చూడాలని ఉరవకొండ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి సూచించారు. నిర్దేశిత వాటా ప్రకారం సీబీఆర్‌కు మొదట నీరు ఇవ్వాలని కడప ఎమ్మెల్సీ బీటెక్ రవి చెప్పారు. హంద్రీనీవా నీరు ఇవ్వాల్సిందేనని ఆలూరు ఎమ్మెల్యే జయరాం సూచించారు. ఈ సమావేశంలో టీబీ-హెచ్చెల్సీ ప్రాజెక్టు ఆయకట్టుదారుల సంఘం ఛైర్మన్ శ్రీనివాసులరెడ్డి, జేసీ రమామణి, జేసీ-2 ఖాజామొహిద్దీన్, హంద్రీనీవా సీఈ జలంధర్, హెచ్చెల్సీ ఎస్ఈ శేషగిరిరావు, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ సుధాకర్‌బాబు, ఎంఐ ఎస్ఈ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నెరవేర్చాలి

కొనసాగిస్తూ రాష్ట్రంలో 175 మంది శాసనసభ్యులుంటే ఎవ్వరూ అగ్రిగోల్డ్ బాధితుల పక్షాన నోరు మెదపట్లేదన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు అగ్రిగోల్డ్ యాజమాన్యాన్ని కాపాడేలా వ్యవహరిస్తున్నాయన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మంది ఎనిమిది రాష్ట్రాల్లో 32 లక్షల ఖాతాదారుల నుంచి రూ.7,600 కోట్లు వసూలు చేశారన్నారు. మన రాష్ట్రంలో ఖాతాదారుల నుంచి రూ.3,965 కోట్లు వసూలు చేసి బినామీ పేర్లతో వాటిని దాచుక్కున్నారని విమర్శించారు. అగ్రిగోల్డ్ ఆస్తులు రూ.20వేల కోట్లు ఉన్నాయని యాజమాన్యాలు చెబుతున్నాయని, ఆస్తులన్నింటిని ప్రభుత్వ స్వాధీనం చేసుకుని బాధితులకు వెంటనే పరిహారం అందించే చర్యలు చేపట్టాలన్నారు. అగ్రిగోల్డ్ నిందితుల్లో కొందరిని అరెస్టు చేయకపోవడం సరికాదన్నారు. బాధితులకు న్యాయం జరిగేవరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన చెప్పారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ తమ ప్రాణాలను పణంగా పెట్టి అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగేందుకు పోరాడుతున్నామన్నారు. బస్సు యాత్ర సెప్టెంబరు 15న అనంతపురం జిల్లాలోని హిందూపురంతో ముగుస్తుందన్నారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామన్నారు. బస్సు యాత్రకు గుంటూరు రోడ్డులోని సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం వద్ద సీపీఐ, ఏఐటీయుసీ, ఏఐఎస్ఎఫ్, అగ్రిగోల్డ్ బాధితులు ఘన స్వాగతం పలికారు.

బాధితుల నుంచి సంఘం నాయకులు వినతిపత్రాలను స్వీకరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, ఏరియా కార్యదర్శి నరిశేటి గురవయ్య, గుంటూరు నగర కార్యదర్శి మాల్యాద్రి, ఏఐటీయుసీ జిల్లా నాయకులు కంబాల శ్రీనివాస్, ఆయా సంఘాల నాయకులు వి.తిరుపతిరావు, శేఖర్, ఈవీ నాయుడు, అంజలి, శ్రీలక్ష్మి, ఆనంద్, మస్తాన్, రమేష్‌బాబు, రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# అడవులు పెంచడమే అటవీశాఖ లక్ష్యం



మహానంది : రాష్ట్రంలో 23 శాతంగా ఉన్న అడవులను 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా అటవీశాఖ పని చేస్తుందని కడప-కర్నూలు జిల్లాల సీసీఎఫ్ గోపీనాథ్ పేర్కొన్నారు. మహానందిలోని అటవీ పర్యావరణ విద్యాకేంద్రంలో నూతనంగా రూ.6.50 లక్షలతో నిర్మించిన విజువల్ ఎఫెక్ట్స్ గది, ప్రొజెక్టర్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గదితో పాటు పర్యావరణ విద్యాకేంద్రంలో ఆధుని కతను సంతరించు కునేలాగా పనులు చేపట్టామన్నారు. వీటిని చూడటానికి పెద్దలకు రూ.10, పిల్లలకు రూ.5 టికెట్ ఏర్పాటు చేశామన్నారు. జంతువులు, పక్షుల అరుపులను సహజంగా వినేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. గ్రంథాలయాన్ని సైతం ఇక్కడ ప్రారం భించామన్నారు. నవంబర్ నాటికి రెండు జిల్లాల్లో 50 లక్షల మొక్కలను పెంచి పంపిణీ చేయడమే లక్ష్యంగా ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల డీఎఫ్‌వో శివప్రసాద్, లాగింగ్ డీఎఫ్‌వో అశోక్, ఎఫ్‌ఆర్వో అబ్దుల్‌ఖాదర్, డీఆర్వో వేణు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### వ్యవసాయ యాంత్రికీకరణపై

# గిరిజన రైతులకు అవగాహన అవసరం

నెల్లూరు : గిరిజన రైతులు వ్యవసాయ పనుల్లో యాంత్రాల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని ఐ.టి.డి.ఎ. పి.ఒ. కమలకుమారి పేర్కొన్నారు. నెల్లూరులోని ఐ.టి.డి.ఎ. కార్యాలయంలో గిరిజన రైతులకు అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటవీ హక్కుల చట్టం కింద జిల్లాలో ఇంత వరకు 871 ఎకరాలు గిరిజను లకు పంపిణీ చేశామన్నారు. వీటిలో భూమి అభివ ృద్ధి పథకాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ భూముల్లో కంది, అపరాలు, చిరుధాన్యాలు వంటి పంటలు పండించుకోవాలన్నారు. వ్యవసాయ సహాయ ప్రాజెక్టు అధికారి ఆర్. గంగాధర్ మాట్లాడుతూ పవర్ వీడర్, టిల్లర్, అయిల్ ఇంజన్లు, రోటోవేటర్లు వివిధ యంత్ర పరికరాలు వినియోగించుకుని వ్యవసాయ పనుల్లో అభివృద్ధి సాధించాలన్నారు. గత ఏడాది 173 మంది రైతులకు రూ.65లక్షలు విలువైన యంత్రపరికరాలను వ్యవసాయశాఖ సమన్వయంతో 90శాతం రాయితీతో పంపిణీ చేసినట్లు తెలిపారు. 2017-18 సంవత్సరానికి రూ.66 లక్షల విలువైన యంత్ర పరికరాలను రాయితీపై ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో వ్యవసాయ యంత్ర పరికరాలు ప్రదర్శనగా ఉంచారు. ఈకార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి కె.జ్యోత్స్న, జిల్లా యానాది సంక్షేమ సంఘం అధ్యక్షులు కె.సి.పెంచలయ్య, యంత్రపరికరాల డీలర్ శ్రీకాంత్, గిరిజన రైతులు పాల్గొన్నారు.

## గాంధి' ఆశ్రమాభివృద్ధికి సహకారం : కలెక్టర్



ఇందుకూరుపేట : సబర్మతి ఆశ్రమంలో మాదిరిగానే పల్లిపాడు గాంధీజీ సత్యాగ్రహ ఆశ్రమంలో నిత్యం బోధనలు జరగాలని, గాంధీజీ అనుసరించిన ఆశయాలకు అనుగుణమైన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రేవు ముత్యాల రాజు సూచించారు. ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో జరుగుతున్న అభివ ృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ సబర్మతి ఆశ్రమం తర్వాత మహాత్మా గాంధీజీ స్వహస్తాలతో ప్రారంభించిన పల్లిపాడు సత్యాగ్రహ ఆశ్రమం దేశంలోనే రెండోదని చెప్పారు. గాంధీజీని ప్రపంచం మొత్తం ఆదర్శంగా తీసు కుందన్నారు. చరిత్రకు సాక్ష్యంగా నిలిచే ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసి భావి తరాలకు స్ఫూర్తి నింపుతామన్నారు. ప్రస్తుతం యువత గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈఈ విజయకుమార్ మాట్లాడుతూ జిల్లాలో పర్యటక రంగ అభివ ృద్ధికి రూ.1.65 కోట్లు మంజూరైతే.. కలెక్టర్ చొరవ తీసుకుని ఆగిపోయిన పనుల కోసం రూ.95 లక్షలు ఆశ్రమానికి కేటాయిం చారని చెప్పారు. మరో పది రోజుల్లో భవనాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యులు నేదురుమల్లి సుబ్బారెడ్డి, నెల్లూరు లక్ష్మయ్య, రాము తదితరులున్నారు.

## బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా బత్తుల నియామకం

కర్నూలు: ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా బత్తుల లక్ష్మీకాంతయ్యను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.ఉదయ్ కిరణ్ పేర్కొన్నారు. లక్ష్మీకాంతయ్యకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.చక్రవర్తి, లీలాకృష్ణ పాల్గొన్నారు.బీసీ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియామకమైన ఆస్పరి శ్రీనివాసులును పత్తికొండలో స్థానిక బీసీ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.


కార్యక్రమంలో నాయకులు ఓబయ్య, ఆనందాచారి, దండి మల్లికార్జున, సీసీ రంగస్వామి, రామాంజనేయులు పాల్గొన్నారు.

# పునరావాస పనులు వేగవంతం : జేసీ

ఒంగోలు : గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిధిలోని ముంపు గ్రామాల కాలనీల్లో మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని జేసీ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. జేసీ తన ఛాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఘడియపూడి, ఎర్రబాలెం, మణికేశ్వరం, అనమనమూరు, చిన్నమల్లవరం, బూరేపల్లి, తమ్మవరం, ధేనువకొండ, గార్లపాడు, తిమ్మారెడ్డిపాలెం, కొటికలపూడిలోని 25 కాలనీల్లో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల పరిధిలోని నిర్వాసితుల సమస్యలను పరిష్కరించే విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పనులు వేగవంతం చేయాలన్నారు. పునరావాస కాలనీల్లో రహదారులు, మురుగునీటి పారుదల నిర్మాణాలను త్వరితంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, పునరావాస కాలనీల్లోని పంచాయతీలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. టెండర్లు పిలిచిన పనులను చిత్తశుద్ధితో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. నిర్వాసితుల అభ్యర్థన మేరకు కాలనీల్లో శ్మశాన సమస్యలను పరిష్కరించాలన్నారు. కాలనీల్లో గ్రామసభ ఏర్పాటు చేసి.. వారికి అవసరమైన జాబ్‌కార్డులు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

పునరావాస కాలనీల్లో తాగునీటిని అందిం చేందుకు గ్రామీణ నీటి సరఫరా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను వేగవంతం చేయాలని అన్నారు. సమావేశంలో ఎస్‌డీసీ ఉదయభాస్కర్, భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ దాసరి సుదర్శనం, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మర్ధన్ ఆలీ, అధికారులు పాల్గొన్నారు.

# జాతర నిర్వహణకు రాజాల సమ్మతి



వెంకటగిరి : దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర నిర్వహణకు తొలి చాటింపుతో సన్నాహాలు సంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యాయి. ఏటా ఇక్కడ అత్యంత వైభవంగా జరిగే ఈ జాతర నిర్వహణకు స్థానిక రాజాల నుంచి దేవస్థానం వర్గాలు అనుమతి పొందే కార్యక్రమాన్ని బుధవారం ఉదయం సంప్రదాయబద్ధంగా పూర్తిచేశారు. తొలుత రాజ కుటుంబీకులు సర్వజ్ఞ కుమార యాచేంద్ర, పుర అధ్యక్షురాలు దొంతు శారద, ఉపాధ్యక్షుడు బీరం రాజేశ్వరరావు, పోలేరమ్మ దేవస్థానం మాజీ ఛైర్మన్ పులి క ృషా?రెడ్డి, తెదేపా పట్టణాధ్యక్షుడు ఆనంద్ తదితరులు దివంగత రాజ కుటుంబీకుడు వి.వి.ఆర్.కె. యాచేంద్ర విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజాల నివాసంలోని బొడ్డుశయక వద్ద రాజ కుటుంబీకులు సర్వజ్ఞ కుమార యాచేంద్ర చేతుల మీదుగా జాతర నిర్వాహకులకు, సంప్రదాయ నిర్వాహకులకు, రెడ్డి పెత్తనందారుడికి తాంబూలం అందజేశారు. గ్రామశక్తి పోలేరమ్మ జాతర నిర్వహణకు తమ సానుకూలతను తెలిపారు. వారి అనుమతితో జాతర నిర్వహణకు సంప్రదాయ నిర్వాహకులను దేవస్థానం పురమాయించింది. వచ్చే బుధవారం 6న రెండో చాటింపు వేస్తారు. వచ్చే నెల 13, 14 తేదీల్లో జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు వేగంగా చేస్తున్నారు. జాతరలో భక్తులు మొక్కు బడులు తీర్చుకొనేందుకు వీలుగా వచ్చే నెల 10వ తేదీ నుంచి ఘటోత్సవం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా రాజ కుటుంబీకులు సర్వజ్ఞ కుమార యాచేంద్ర మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పోలేరమ్మకు భక్తులు ఉన్నారన్నారు. అనాదిగా జరిగే ఈ జాతర వైభవాన్ని మరింతగా పెంచాలన్నారు. గతేడాది ఆధునిక పరిజ్ఞానం వినియోగించి జాతర వైభవం పెంచారు. జాతర మనందరిది, కేవలం ప్రభుత్వంపైన వదిలేయకుండా ప్రతి ఒక్కరూ తమవంతుగా తోడ్పాటును అందించాలన్నారు. అమ్మవారి క ృపకు ప్రతి ఒక్కరూ పాత్రులు కావాలన్నారు.

కార్యక్రమంలో దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి రామచంద్రయ్య, కౌన్సిలర్లు చంగా రావు, మణి, శంకరయ్య, రమేష్, విశ్వనాధం, మంచిబాబు, తెదేపా పట్టణ ఉపాధ్యక్షుడు చంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగాధర్, అధికార ప్రతినిధి కోటేశ్వరరావు, నేతలు మల్లారం బాబు, వీరయ్య, నాగరాజు, లాలాపేట సహకార సంఘం అధ్యక్షుడు వెంకటముని, సంప్రదాయ నిర్వాహకులు పెంచలయ్య, షణ్ముగం, మల్లి తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ ప్రాంతీయ వార్తలు

## అధికారంలోకి రాగానే నవరత్నాల అమలు : మేకపాటి



నెల్లూరు : ప్రజల కోసం వైకాపా రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి నవరత్నాలు అధికారంలోకి రాగానే అమలు చేస్తారని నెల్లూరు ఎంపీ మేకపాటి రాజ మోహన్‌రెడ్డి వెల్లడించారు. నవరత్నాల కార్యక్రమం నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ అధ్యక్షతన నెల్లూరులో కల్యాణ మండంలో నిర్వహించారు. ఎంపీ ముఖ్య అతిధిగా కార్యక్రమంలో పాల్గొని విజయ శంఖారావం, నవరత్నాలు వంటి కార్యక్రమాలు పార్టీ అభివృద్ధి కోసం ప్రారంభించారని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం మూడు సంవత్సరాలు దాటినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ఎంపీ విమర్శించారు.నంద్యాల ఎన్నికలో డబ్బు వెదజల్లి తెదేపా అభ్యర్థిని గెలిపించుకున్నారన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు పోలింగ్ బూత్ కమిటీతో త్వరలో జగన్ సమావేశం అవుతారని తెలిపారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఉపఎన్నికలో గెలవడం కాదని 2004 ఎన్నికల తరహాలో రానున్న ఎన్నికల్లో తెదేపాకు అపజయం తప్పదని అన్నారు. పార్టీలో అన్ని స్థాయిల నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేసేందుకు సిద్దంగా ఉన్నామని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు కార్పొరేటర్‌లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## తాత్కాలిక ఉద్యోగుల సమస్యలపై కృషి

### హంసా రాష్ట్ర అధ్యక్షుడు యోగేశ్వరరెడ్డి



నెల్లూరు : వైద్య, ఆరోగ్య శాఖలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు హెల్త్, మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) రాష్ట్ర అధ్యక్షుడు యోగేశ్వర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జరిగిన ఆ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పదిహేనేళ్లుగా తాత్కాలిక ప్రాతిపదికన కొన సాగుతున్న హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఫార్మాసిస్టులను రెగ్యులర్ చేయాలన్నారు. అతి తక్కువ జీతాలతో సేవలందిస్తున్న 108, చంద్రన్న సంచార చికిత్స సిబ్బందికి జీతాలను పెంచాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్, నాయకులు ప్రతాప్‌బాబు, లక్ష్మీ కుమారి, రాజ్‌కుమార్ ఆచార్యులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అంతుచిక్కని వ్యాధిపై వీడని ఆందోళన

దగదర్తి : దగదర్తి మండలంలోని మనుబోలుపాడులో అంతు చిక్కని వ్యాధి పట్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే గ్రామంలో 30 మందికి పైగా ఈ వ్యాధితో ఇబ్బందులు పడుతున్నారు. వీరిలో కొంత మంది రక్త నమూనాలను జిల్లా క్షయ నియంత్రణ అధికారి వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలోని వైద్య బృందం సేకరించి పరీక్ష నిమిత్తం పంపారు. ఎక్కువ మందికి నెగటివ్ రిపోర్ట్ రావడం గమనార్హం. ఇద్దరికి మాత్రమే టి.బి ఉన్నట్లుగా (పాజిటివ్ రిపోర్ట్) వచ్చినట్లు తెలిసింది. దీనిపై జిల్లా క్షయ వైద్యాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ మనుబోలుపాడులో ఎక్కువ మంది క్షయ నివారణ మందులు వాడడం వల్లనే నెగటివ్ రిపోర్ట్ వచ్చిందని చెప్పారు. అయితే ఒకే సారి ఇంత మందికి టి.బి వ్యాధి రావడం పట్ల సరియైన వివరణ ఇవ్వలేదు. రోగుల నివాసాల్లోని పశువుల రక్త నమూనాలను పశువైద్యులు సేకరించి రిపోర్ట్ కోసం పంపిఉన్నారు. ఇంతవరకూ వాటి వివరాలు రాలేదు. ఇంతమందికి ఒక్కసారిగా వ్యాధి ఎందుకు వచ్చిందో తెలియక గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి బంధువులు వచ్చేందుకు సైతం భయపడుతున్నట్లు వారు చెప్పారు. నాలుగేళ్లుగా కరవుతో అల్లాడుతున్నామని, ఇప్పుడు ఈ వ్యాధి కారణంగా కంటి మీద కునుకులేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని మారెళ్ల పాడులోనూ 13 మందికి ఈ వ్యాధి లక్షణాలు బయటపడినట్లు తెలిసింది. అధికారులు మాత్రం ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేవని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి అసలు వ్యాధిని కనిపెట్టి నివారణకు కృషి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఉపాధి కూలీలకు 250రోజుల పని కల్పించాలి

పగిడ్యాల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలందరికీ 250రోజుల పనిదినాన్ని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా రూ.44కోట్ల ఉపాధి హామీ కూలీల బకాయిలు ఉన్నట్లు పేర్కొన్నారు.

## ప్రతి బిడ్డకూ ఎంఆర్ టీకా వేయాలి

### వైద్య, ఆరోగ్య శాఖ ఆర్‌డీ షాలినీదేవి

నెల్లూరు : మీజెల్స్, రూబెల్లా వ్యాక్సిన్‌ను ప్రతీ బిడ్డకు అందించేలా కృషి చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకులు షాలినీ దేవి సూచించారు. నగరంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆర్‌డీ వైద్యాధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 6 నెలల నుంచి 15 ఏళ్లలోపు చిన్నారులందరికీ వచ్చే నెల 8వ తేదీలోపు ఎంఆర్ వ్యాక్సిన్‌ను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఎన్టీఆర్ ఉచిత పరీక్షలు, ఈ ఔషధి, టెలీ రేడియాలజీ, 102 కాల్ సెంటర్ పథ కాలను పక్కాగా అమలు చేయాలన్నారు. ప్రజలకు చేరువయ్యేలా క ృషి చేయాలన్నారు.

పీహెచ్‌సీ, ఉప కేంద్రాల్లో.. ఏఎన్‌ఎంవోఎల్, ఎంఎం హెచ్‌సీ కార్యక్రమాలపై అవగాహన కల్పించి.. సిబ్బందికి అందజేసిన ట్యాబ్‌లలో వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. 24/7 ఆసుపత్రుల్లో కాన్పులను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు.

అదేవిధంగా కాన్పులను ఆన్‌లైన్లో పొందు పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వర సుందరం, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### నిమజ్జనం.. బక్రీదు

## కలిసి మెలిసి జరుపుకోవాలి

కర్నూలు : వచ్చేనెల 2న గణనాథుల నిమజ్జనం, బక్రీదు పర్వదినాలు రెండూ ఒకే రోజు వచ్చాయని ప్రజలంతా కలిసిమెలిసి ప్రశాంత వాతావరణంలో జరుపు కొనేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టరు ఎస్.సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. ఆయన తన క్యాంపు కార్యాలయంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరప్రజల తాగునీటి అవసరాలకు రోజూ 60 క్యూసెక్కులు అవసరమవుతుందని ప్రస్తుతం ఉన్న నీటి లభ్యత 20 రోజులకు సరిపోతుందన్నారు. సుంకేసుల జలాశయంలో 0.1 టీఎంసీ లభ్యత ఉన్న కారణంగా సెప్టెంబరు 1న ఉదయం కేసీ కాల్వకు నీరు విడుదల చేయాలని నీటిపారుదలశాఖ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రావును కలెక్టర్ ఆదేశించారు. వచ్చేనెల 2వ తేదీ ఉదయం నీరు చేరే సమయానికంతా కేసీ కాలువలో నిమజ్జనం ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ హరినాథరెడ్డికి సూచించారు.

వినాయక విగ్రహాలను ఎక్కడపడితే అక్కడ నిమజ్జనం చేయకుండా క్రమపద్ధతిలో నిర్వహించేందుకు డీఎస్పీ, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, గణేష్‌మహోత్సవ కేంద్రసమితి ఇద్దరు సభ్యులతో కూడిన కమిటి ఏర్పాటుచేసుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, గుర్తించిన ప్రదేశాల్లోనే వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనానికి నీటి లోటు లేకుండా కాల్వలో అడ్డంగా ఇసుక బస్తాలతో కట్టవేయడం లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని నీటిపారుదల శాఖ ఎస్‌ఈని కోరారు. నిమజ్జనానికి అవసరమైన క్రేన్‌లను ఏర్పాటు తదితర అంశాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీఓ డి.హుసేన్‌సాహెబ్, డీఎస్పీ రమణమూర్తి, ఆర్‌అండ్‌బీ ఈఈ జయరామిరెడ్డి, గణేష్ కేంద్ర మహోత్సవ సమితి కార్యాధ్యక్షుడు కిష్టన్న, జిల్లా ప్రధానకార్యదర్శి బాల సుబ్రమణ్యం, కోశాధికారి సందడి సుధాకర్, ఉప ప్రధాన కార్యదర్శి కాళింగ నరసింహవర్మ, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

# నంద్యాల విజయంతో పార్టీలో నూతన ఉత్తేజం

నెల్లూరు : నంద్యాల ఉప ఎన్నికల్లో తెదేపా గెలుపు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లోగాని, పార్టీలోగానీ నూతన ఉత్తేజం తీసుకొచ్చింది. మూడేళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పడిన కష్టం, ప్రత్యేక పరిస్థితుల్లో రాష్ట్రం విడిపోవడం, రూ.16వేల కోట్ల లోటు బడ్జెట్‌లో ఉన్న సమయంలో చేసిన అభివృద్ధికి ఈ ఎన్నికలు అద్దం పట్టాయని రాష్ట్ర వ్యవసాయశాఖామాత్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి అన్నారు. విజయవాడ నుంచి నెల్లూరుకు వచ్చారు. ఆయనకు తెదేపా నగర, గ్రామీణం, సర్వేపల్లి నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్పొరేటర్‌లు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు రైల్వేస్టేషన్‌లో స్వాగతం పలికారు. స్టేషన్ ఆవరణంలోనే పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు. అందరికీ మిఠాయిలు పంచి పెట్టారు. పూలమాలలు, శాలువాలు, పుష్పగుచ్ఛాలేతో సోమిరెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నికల్లో ప్రతిపక్షపార్టీ వైకాపా ప్రవర్తించిన తీరుకూడా అక్కడి ప్రజలు, ఓటర్లు తెలుగుదేశం పార్టీ మంచి మెజార్టీతో గెలవాలని కోరుకొని తమ ఓటుతో సమాధానం చెప్పారన్నారు. కాకినాడ ఎన్నికల్లోనూ తెలుగుదేశం గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జగన్ మోహన్‌రెడ్డి చెప్పినట్లు నంద్యాల ఎన్నికల ఫలితాలు మూడేళ్ల తెదేపా పరిపాలనకు రెఫరెండం అని చెప్పారని, ఆయన సవాల్‌ను మేము స్వీకరించామని, ఆయన అన్నట్లే 2019 ఎన్నికలు ఏ విధంగా ఉండబోతున్నాయో ప్రజలు ఇప్పుడే తీర్పిచ్చారని మంత్రి పేర్కొన్నారు.

నంద్యాలలో తెదేపా విజయం కోసం పని చేసిన ప్రతి ఒక్కరిని, తెదేపాను గెలిపించిన ప్రజలకు అభినం దనలు తెలియజేశారు. కార్పొరేటర్‌లు దాసరి రాజేష్, మేకల రామ్మూర్తి, సత్యనాగేశ్వరరావు, పోతూరు శైలజ, నాయకులు మున్వర్‌బాషా, ఒట్టూరు సంపత్‌రాజు, సర్వేపల్లి నియోజకవర్గ నాయ కులు మోపూరు శ్రీనివాసులురెడ్డి, సోమిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, బొమ్మి సురేంద్ర, కోడూరు కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### ట్రంప్ ప్రకటన ఆలోచనీయమే

మన ప్రయోజనాల పరిరక్షణకు సొంత విధానాలను ఏమేర అనుసరించగలదనేది ప్రధానం. అమెరికా పాకిస్థాన్‌ను దూరంగా పెట్టి, భారత్‌కు మద్దతు ఇవ్వడం పట్ల మన విదేశాంగ మంత్రిత్వ శాఖ హర్షం వెలిబుచ్చింది. కానీ ఈ మద్దతు వెనుక గల ఉద్దేశాన్ని కూడా గ్రహించాలి. భారత్‌ను సైనికంగా అఫ్ఘానిస్థాన్ రొంపిలోకి దింపే ప్రమాదం ఉన్నది. ఇప్పటికే నామమాత్రంగా ఉన్న సైనిక సహకారాన్ని పెంచే విధంగా ఒత్తిడి తేవచ్చు. నాటోయేతర మిత్రపక్షంగా దక్షిణాసియాలో అమెరికా ప్రయోజనాలను కాపాడటం భారత్ బాధ్యతగా మారిపోవచ్చు. అందువల్ల భారత్ జాగ్రత్తగా వ్యవహరించాలి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల ప్రకటించిన దక్షిణాసియా విధానం ప్రచ్ఛన్న యుద్ధానంతరం మారిన పరిస్థితులకు అనుగుణంగా ఉన్నది. పాకిస్థాన్‌ను ఇరుకున పెట్టి భారత్‌వైపు స్పష్టమైన మొగ్గును ప్రకటించింది. కానీ అఫ్ఘానిస్థాన్ విధానమే ఆశ్చర్యం కలిగిస్తున్నది. ట్రంప్ అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో అఫ్ఘానిస్థాన్‌లో సైనిక చర్యకు వ్యతిరేకంగా మాట్లాడారు. ప్రజాభిప్రాయం కూడా అఫ్ఘానిస్థాన్‌లో యుద్ధానికి త్వరగా ముగింపు పలకాలనే రీతిలో ఉన్నది. కానీ అధికారం చేపట్టిన తరువాత ఇప్పుడు మరింత మొండి వైఖరిని ప్రదర్శిస్తున్నారు. అఫ్ఘానిస్థాన్ నుంచి నిర్ణీత కాల వ్యవధిలో దళాలను ఉపసంహరించుకోవాలనేది ఇప్పటివరకు అనుసరిస్తున్న విధానం. అది ఎప్పుడు సాధ్యమవుతుందో తెలువదు కానీ, సాధ్య మైనంత తొందరగా ఆ యుద్ధం నుంచి బయటపడాలనే అభిప్రాయమే బలంగా ఉండేది. కానీ ఇప్పుడు ట్రంప్ నిర్ణీత కాల వ్యవధి అంటూ ఏమీ ఉండదని అంటున్నారు. అక్కడి పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ట్రంప్ ఈ నిర్ణయానికి రావడానికి కూడా కారణం ఉన్నది. ఇరాక్ లో మాదిరిగా తమ దళాలను ఉపసంహరించుకుంటే ఆ శూన్యాన్ని ఉగ్రవాద శక్తులు భర్తీ చేస్తాయనే ఆందోళన అమెరికాకు ఉన్నది. కానీ అమెరికా ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉన్నది. సంక్షేమ విధానాలు సన్నగిల్లిపోతున్నాయి. ఈ నేపథ్యంలో యుద్ధ వ్యయాన్ని ఎట్లా భర్తీ చేస్తారనేది పెద్ద సమస్య. యుద్ధం మొదలుపెట్టారు కనుక లబ్ధి జరిగే రీతిలో గౌరవంగా బయటపడాలి. కానీ గతంతో పోలిస్తే తాలిబన్లు అఫ్ఘానిస్థాన్ అంతటికీ విస్తరించారు. అటు ఇరాన్ ఇటు చైనా, రష్యా కాచుకొని ఉన్నాయి. ఈ పరిస్థితులలో యుద్ధభారాన్ని మిత్ర పక్షాలపై మోపాలనేది ట్రంప్ ఆలోచనగా కనిపిస్తున్నది. అమెరికాతో భారత్‌కు వాణిజ్య మిగులు ఉన్నది కనుక, అఫ్ఘానిస్థాన్ అభివృద్ధికి తోడ్పడాలని ట్రంప్ పక్కా వ్యాపారి తరహాలో వ్యాఖ్యానించడం గమనార్హం. అఫ్ఘానిస్థాన్ మధ్య ఆసియా, దక్షిణాసియా, పశ్చిమాసియాలో ప్రాబల్యం కాపాడుకోవడానికి కీలకం. కానీ అఫ్ఘానిస్థాన్- పాకిస్థాన్ ప్రాంతం తాలిబన్లు, ఐఎస్ తదితర ఉగ్రవాద వర్గాలకు కేంద్రంగా మారిపోయింది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌ను నియంత్రించడానికి అమెరికా ప్రయత్నిస్తున్నది. మరోవైపు భారత్‌ను మెప్పించడానికి ప్రయత్నిస్తున్నది. కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న హిజ్బుల్ ముజాహిదీన్ సంస్థను ఉగ్రవాద సంస్థగా గుర్తించింది. ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేద్దామనే ఆకాంక్షను ట్రంప్ వ్యక్తం చేశారు. అఫ్ఘానిస్థాన్ వ్యూహంలో భారత్ కలిసి రావాలని కోరుకుంటున్నది. భారత్ ఇప్పటికే అఫ్ఘానిస్థాన్‌లో అనేక అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టింది. 2001 నుంచి ఇప్పటివరకు మూడు వందల కోట్ల డాలర్ల మేర ఆర్థిక సహాయం అందించింది. రహదారులు, నీటిపారుదల ప్రాజెక్టులతో పాటు పార్లమెంటు భవనాన్ని కూడా నిర్మించి పెట్టింది. ఇకముందు కూడా పునర్నిర్మాణంలో భారత్ తోడ్పాటు ఉంటుంది. కానీ ట్రంప్ ఆశిస్తున్నది అంతకుమించిన సైనిక సహాయం. భారత్ ఇప్పటికే అఫ్ఘానిస్థాన్‌కు నాలుగు సైనిక హెలికాప్టర్లను సమకూర్చింది. భారత్ నుంచి మరింత సైనిక మద్దతు కావాలని అమెరికా సైనిక కమాండర్ జాన్ నికల్సన్ గత ఏడాది కోరారు. కానీ అఫ్ఘానిస్థాన్ యుద్ధం మొదలు పెట్టి పదహారేండ్లు అవుతున్నది. నాటో దేశాలు సైనికంగా, ఆర్థికంగా భారీగా నష్టపోయాయి. అమెరికా, యూరప్ దేశాలలోని ప్రజలు అఫ్ఘానిస్థాన్ పోరాటం పట్ల వ్యతిరేకతను ప్రదర్శిస్తున్నట్టు తాజా సర్వేలు సూచిస్తున్నాయి. పాకిస్థాన్ ప్రచ్ఛన్న యుద్ధకాలమంతా అమెరికా మిత్రదేశంగా ఉన్నది. భారత్ సోవియెట్ యూనియన్‌తో సాన్నిహిత్యాన్ని పెంచుకున్నది. ఈ మైత్రి అంతర్జాతీయ రంగంలో బల ప్రదర్శనకు, దౌత్య విధానాలకే పరిమితం కాదు.

అమెరికా సూచించిన అంతరంగిక, ఆర్థిక విధానాలు పాకిస్థాన్‌ను కల్లోల భరితం చేశాయి. భారత్ సోవియెట్ యూనియన్ వైపు మొగ్గు చూపినప్పటికీ, అలీన విధానాన్ని వదిలిపెట్టలేదు. స్వావలంబన, సంక్షేమ విధానాలను కూడా అనుసరించి అన్ని రంగాలలో అభివృద్ధి సాధించింది.

## హర్వే నష్టం.. రూ.3లక్షల కోట్లు



పారిస్: ఎడతెరిపిలేని వర్షాలు.. వరదలు.. దీనికి తోడు బలమైన గాలులు.. నదులను తలపిస్తున్న రోడ్లు.. నీటమునిగిన భవనాలు.. ఇది గత ఐదురోజులుగా అమెరికాలోని టెక్సాస్ రాష్ట్ర ప్రజల పరిస్థితి. టెక్సాస్ రాష్ట్రాన్ని హర్వే హరికేన్ వణికిస్తోంది. హర్వే ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా టెక్సాస్‌లోని హ్యూస్టన్, దాని పరిసర ప్రాంతాలు సముద్రాలను తలపిస్తున్నాయి. ఈ ప్రకృతి విపత్తులో ఇప్పటికే 30 మంది ప్రాణాలు కోల్పోయారు. కాగా.. హర్వే ధాటికి టెక్సాస్ రాష్ట్రం ఆర్థికంగా భారీగా నష్టపోయినట్లు తెలుస్తోంది. టెక్సాస్‌లో హర్వే నష్టం 58బిలియన్ డాలర్ల(భారత కరెన్సీలో దాదాపు రూ.3లక్షల కోట్లు) వరకూ ఉంటుందని జర్మనీకి చెందిన విపత్తు విశ్లేషణ సంస్థ ఒకటి వెల్లడించింది.

వరద నష్టం 58 మిలియన్ డాలర్ల వరకూ ఉంటుందని అంచనా. 1990 నుంచి టెక్సాస్‌కు అత్యంత నష్టం మిగిల్చిన తొమ్మిదో జాతీయ విపత్తు ఇది అని జర్మనీలోని సెంటర్ ఫర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ రిస్క్ రెడక్షన్ టెక్నాలజీ(సీఈడీఐఎం) నివేదిక రూపొందించింది. అమెరికా ఆర్థిక విశ్లేషణ సంస్థ నుంచి డేటాను తీసుకుని సీఈడీఐఎం ఈ నివేదికను తయారుచేసింది. ప్రస్తుత వరదల ధాటికి అనేక భవనాలు నీట మునిగాయని, కొన్ని ధ్వంసమయ్యాయని పేర్కొంది. చాలా వాటిని మళ్లీ నిర్మించాల్సిన అవసరం కూడా ఉందని నివేదికలో తెలిపింది. గత ఐదురోజులుగా టెక్సాస్‌లో భారీ వర్షాల కారణంగా వరదలు సంభవించాయి. వేలాది ఇళ్లలోకి వరద నీరు పోటెత్తింది. దీంతో అధికారులు సహాయకచర్యలు చేపట్టి వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గత శుక్రవారం నుంచి బుధవారం వరకు 132 సెం.మీల వర్షపాతం నమోదైంది. ఇంత భారీ వర్షం కురవడం అరుదైన రికార్డుగా జాతీయ వాతావరణ సేవల అధికారులు వెల్లడించారు. కాగా.. గురువారం హరికేన్ క్రమంగా బలహీనపడే అవకాశంగా ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## నష్టాల్లోంచి.. లాభాల్లోకి..




ముంబయి: దేశీయ సూచీలు గురువారం లాభాలతో ముగిశాయి. ఆగస్ట్ డెరివేటివ్స్ సెటిల్మెంట్ల నేపథ్యంలో ఆరంభ ట్రేడింగ్‌లో సూచీలు కాస్త తడబడినా.. చివర్లో కొనుగోళ్లు జరగడంతో లాభాలను సాధించాయి. సెన్సెక్స్ 80 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ మళ్లీ 9,900 మార్కును దాటింది.

అంతర్జాతీయ మార్కెట్ల సానుకూలతతో క్రితం సెషన్లో బలంగా పుంజుకున్న సెన్సెక్స్.. గురువారం నాటి ట్రేడింగ్ ఆరంభంలో 43 పాయింట్లు కోల్పోయి 31,603 వద్ద బలహీనంగా ప్రారంభమైంది. ఆగస్టు డెరివేటివ్స్ ముగింపు నేపథ్యంలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీ ఒత్తిడికి గురైంది. అయితే మధ్యాహ్నానికి కొనుగోళ్లు పెరగడంతో కోలుకున్న సూచీ.. చివరకు 84 పాయింట్లు లాభపడి 31,730 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ కూడా 33 పాయింట్ల లాభంతో 9,918 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ. 63.91గా కొనసాగుతోంది.

ఎన్ఎస్ఈలో విప్రో, మారుతి సుజుకీ, టాటాపవర్, రిలయన్స్, బజాజ్ ఆటో షేర్లు లాభపడగా.. బాష్ లిమిటెడ్, భారతీ ఇన్‌ఫ్రాటెల్, కోల్‌ఇండియా, ఇన్ఫోసిస్, అరబిందో ఫార్మా షేర్లు నష్టపోయాయి.

## సెక్రటేరియట్‌లో భారీ అగ్నిప్రమాదం



గువాహటి: అసోం సెక్రటేరియట్ జనతా భవన్‌లో గురువారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అయితే, ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి అపాయం సంభవించ లేదు. జనతాభవన్‌లోని ఆర్థిక శాఖ కార్యాలయాలుండే ఎఫ్ బ్లాకులో మంటలు చెలరేగాయి. దానికి ఆనుకుని ఉండే ఛాంబర్‌లోనే సీఎం సర్బానంద్ సోనోవాల్ సమావేశం జరుగుతోంది. అదే సమయంలో మంటలు చెలరేగటంతో అధికారులు, ప్రజాప్రతినిధులు భయాందోళనలకు గురయ్యారు.

ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకున్నారు.

ఆర్థిక శాఖకు చెందిన రెండు గదుల్లో ఫైళ్లు, ఫర్నిచర్ పూర్తిగా కాలిపోయాయని అధికారులు తెలిపారు. ఏఏ ఫైళ్లు కాలిపోయాయనేది తెలియాల్సి ఉందన్నారు.

ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది. కాగా, షార్ట్‌సర్క్యూట్‌తోనే ఈ ఘటన జరిగి ఉంటుందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

## కవి సమయం

### ఆశల పల్లకి

ఆ, క్షణంకై - ఆ, ఒక్క క్షణంకై;
ఈ క్షణాలు - ఈ అన్వేషణ
ఈ ఆరాటం - ఈ ఆర్భాటం
నిండు నూరేళ్ల జీవితం కావాలని
ఆ కాంక్ష - ఆ కాంక్ష - ఆ కాంక్ష
ఎక్కడున్నదో! నా పిట్టా!
ఎక్కడున్నదో ! నా గుట్టా! అని
వేదికి, వేదికి, వేదికి ఎన్నుకున్నా!
వివాహ మహోత్సవం ఏర్పాట్లు
చేసుకున్నా! ... ॥ఈ క్షణం॥
బంధు మిత్రులను - ఆడపడ్చులను
ఆహ్వానించుకున్నా!
తోటి పెళ్లి తతంగాలు జరుపుకున్నా!
వేది పండితుతుల శోత్రాలతో,
మంగళ వాయుద్వాలతో,
అక్షింతాల - ఆశీర్వాదాలతో,
మూడుముళ్లు కట్టా! ... ॥ ఆ క్షణం॥
పసుపుబొత్తుల - బ్రహ్మముడులతో
అగ్నిసాక్షిగా ఉండాలని - అగ్నిహోమము
చుట్టూ;
చిలకట్టు కట్టె చిలక - చిటికిన వ్రేళ్లు
పట్టుకొని
ఏడడుగులు నడ్చుకున్నా!
ముత్యాల తలంబ్రాల ముచ్చట్లు
జరుపుకొన్నా!
ఆశల పల్లకి ఎక్కి ఊరేగించుకున్నా!
...॥ఆ క్షణం॥

రచయిత
యల్.సిద్ధు
7702977293

## పంచాంగం

మాసం : భాద్రపద ; తిథి : శుద్ధ దశమి ఉ.6,23;
పూర్వాషాడ పూర్తి మ.వ.3.28ల 5.14


శుక్రవారం
01-09-2017

**మేషం** : చేతివృత్తుల వారికి అంతంతమాత్రంగానే ఉంటుంది.ఖర్చులు మీ రాబడికి తగినట్లుగానే ఉంటాయి. కోర్టు వ్యవహారాలు, ఆస్తి తగాదాలు కొత్తమలుపు తిరుగుతాయి. రుణం ఏ కొంతైనా తీర్చాలన్న మీ యత్నం ఫలిస్తుంది. స్పెక్యులేషన్ రంగాల వారికి సామాన్యం. **వృషభం** : రావలసిన ధనం అందటంతో తనఖా పెట్టిన వస్తువులు విడిపించుకుంటారు. ఎదుటివారు మీ మాటలను తప్పుగా అర్థం చేసుకుంటారు. గృహంలో ఒక శుభకార్యం చేయాలనే ఆలోచన స్ఫురిస్తుంది. పిల్లలు, ప్రియతములతో కలసి విందులు, వేడుకలలో పాల్గొంటారు. స్త్రీలకు గుర్తింపు, రాణింపు లభిస్తుంది. **మిథునం** : బంధువుల రాకపోకలు సంతోషాన్ని కలిగిస్తాయి. రావలసిన మొండిబాకీలు సైతం వసూలు కాగలవు. లిటిగేషన్ వ్యవహారాలలో జాగ్రత్త వహించండి. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. అనుకోని బకాయిలు వసూలవుతాయి. వాహనం నడిపేటప్పుడు జాగ్రత్త అవసరం. ఆరోగ్యంపట్ల జాగ్రత్త వహించండి. **కర్కాటకం** : వృత్తి, ఉద్యోగాలందు ఉన్న వారికి ఆదాయం బాగుంటుంది. ఆర్థిక పరిస్థితి ఆశా జనకంగా ఉంటుంది. కోర్టు వ్యవహారాలు పరిష్కార దిశగా సాగుతాయి. మిత్రుల సహకారంతో కొన్ని సమస్యలు పరిష్కార మవుతాయి. బాకీలు వసూలవుతాయి. సంఘంలో మీకు మంచి పేరు, ఖ్యాతి లభిస్తుంది. కుటుంబానికి మనశ్శాంతి లభిస్తుంది. **సింహం** : ఆర్థిక విషయాలలో కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొ న్నప్పటికీ ముఖ్యుల సహకారం వలన సమసిపోతాయి. కొత్తగా చేపట్టిన వ్యాపా రాల్లో లాభాలు పొందుతారు. పాత సమస్యలు మీకు అనుకూలించగలవు. టెక్ని కల్, కంప్యూటర్, ఎలక్ట్రానికల్ రంగాలలోని వారికి చికాకులు తప్పవు. నూతన పరిచయాలు ఏర్పడతాయి. **కన్య** : వృత్తి, వ్యాపార రంగాల వారికి అను కూలంగా ఉంటుంది. స్పెక్యులేషన్ రంగాల వారికి లాభం చేకూరుతుంది. ఆరోగ్యంలో చిన్న చిన్న సమస్యలు ఎదుర్కొన్నప్పటికీ నెమ్మదిగా సమసిపోతాయి. మీ కుమారుని మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. వాహనం నడుపుతున్నప్పుడు జాగ్రత్త అవసరం. **తుల** : వృత్తి, వ్యాపార రంగాల వారికి అనుకూలంగా ఉంటుంది. స్పెక్యులేషన్ రంగాల వారికి లాభం చేకూరుతుంది. ఆరోగ్యంలో చిన్న చిన్న సమస్యలు ఎదుర్కొన్నప్పటికీ నెమ్మదిగా సమసిపోతాయి. మీ కుమారుని మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. వాహనం నడుపుతున్నప్పుడు జాగ్రత్త అవసరం. **వృశ్చికం** : ఉద్యోగస్తులకు పై అధికారులవల్ల ఒత్తిడి, చికాకులు ఎక్కువవుతాయి. విద్యార్థుల ఆలోచనలు పక్క దారి పట్టేందుకు ఆస్కారం ఉంది. అనవసరపు వివాదాల్లో తలదూర్చి సమస్యలు తెచ్చుకోకండి. స్థిరాస్తికి సంబంధించిన చర్చలు సత్ఫలితాలను ఇవ్వగలవు. ప్రైవేటు సంస్థల్లోని వారికి శ్రమకు తగిన ప్రతిఫలం కానవస్తుంది. **ధనుస్సు** : దంప తుల మధ్య చిన్న చిన్న అభిప్రాయబేధాలు తలెత్తుతాయి. అర్థాంతరంగా ఆపివేసిన పనులను పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి శుభాకాంక్షలు అందుకుంటారు. పీచు, నార, ఫోమ్, లెదర్ వ్యాపారస్తులకు మందకొడిగా ఉండును. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. మీ ఆంతరంగిక విషయాలను గోప్యంగా ఉంచటం మంచిది. **మకరం** : ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఉమ్మడి వ్యాపారులకు ధన నష్టం కలిగే అవకాశం ఉంది. స్థిర చరాస్తుల విషయంలో జాగ్రత్త అవసరం. దంపతుల మధ్య అవగాహనా లోపం. రాజకీయ నాయకులు వాగ్దానాలు చేసి సమస్యలు తెచ్చుకోకండి. లాటరీ వ్యాపారస్తులకు సంతృప్తి కానవస్తుంది. **కుంభం** : స్త్రీలకు కాళ్లు, తల, నరాలకు సంబంధించిన చికాకులు అధికంఅవుతాయి. చిట్స్, ఫైనాన్స్, బ్యాంకింగ్ రంగాల వారికి ఒత్తిడి పెరుగుతుంది. నిరుద్యోగులు భేషజాలకు పోకుండా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవటం మంచిది. హామీలు, మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండటం మంచిది. **మీనం** : సహోద్యోగులు, సన్నిహితులతో సమా వేశం నిరాశా జనకంగా ముగుస్తుంది. స్త్రీలకు ఆరోగ్యంలో మెలకువ అవసరం. ఇప్పటిదాకా విరోధులుగా ఉన్న వ్యక్తులను సుముఖం చేసుకోగలుగుతారు. ఎంతో శ్రమించిన మీదట గాని అనుకున్న పనులు పూర్తి కావు.

## శ్రీరామచంద్రుడు.. సాక్షాత్తు దేవుడే!

### సంకీర్తన

రాముడు చెడ్డవాడంటూ ఇటీవల కాలంలో కొందరు కొన్ని వితండవాదాలు లేవదీస్తున్నారు. రాముడే కాదు లక్ష్మణుడూ అలాంటివాడేనని కూడా దబాయిస్తున్నారు. రాముడు మంచివాడైతే సీతాదేవిని అడవులెకందుకు పంపించాడని ప్రశ్నకూడా వేస్తున్నారు. వాటన్నిటికీ సమాధానమే ఈ ప్రయత్నం. వాల్మీకిని రామాయణం రాయమని ప్రోత్సహించడానికి వస్తాడు నారదుడు. పంపా తీరంలోని వనంలో హనుమంతుడినిచూసి, ఆయన మాటపై గౌరవంవుంచి, సుగ్రీవుడితో స్నేహంచేసాడు రాముడు. తనకథ, సీతవృత్తాంతం మొత్తం ఆయనకు చెప్పాడు. చెప్పిన తర్వాత, సుగ్రీవుడు రాముడితో అగ్ని సాక్షిగా స్నేహితులయ్యారు. రాముడు వానరుడితో స్నేహం చేశాడంటే అది అతడి సౌశీల్యాతిశయం గురించి చెప్పడమే. గుహుడు హీనజాతివాడైనా, పురుషుడైనందున అతనితో స్నేహం చేసినందువల్ల రాముడి సౌశీల్యం చెప్పడం జరిగింది. హీన స్త్రీ అయిన శబరితో స్నేహం చేయడంవల్ల రాముడు మిక్కిలి సౌశీల్యవంతుడయ్యాడు. వానరుడైన సుగ్రీవుడితో స్నేహమంటే మీదుమిక్కిలి సౌశీల్యం చూపడం జరిగింది. శ్రీరామచంద్రుడు ప్రశస్తమైన ధర్మజ్ఞానం గలవాడు. చేసిన ప్రతిజ్ఞ తప్పనివాడు. దానధర్మాలు, స్వాశ్రీతరక్షణ వల్ల లభించినయశస్సు, శత్రువులను అణచినందున వచ్చిన కీర్తి గలవాడు. సర్వజ్ఞుడు. బ్రహ్మజ్ఞాన సంపన్నుడు. ఆత్మతత్వం ఎరిగినవాడు. విష్ణువుతో సమానుడు. లోకాలను పాలించ సమర్థుడు. ప్రాణికోటిని రక్షించాలన్న కోరికున్నవాడు. ధర్మాన్ని తానాచరిస్తూ, ఇతరులతో ఆచరింపచేసేవాడు. అలా వచ్చిన నారదుడిని, గుణవంతుడు, అతివీర్యవంతుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యశీలుడు, సమర్థుడు, నిశ్చలసంకల్పుడు, సదాచార సంపన్నుడు, సమస్త ప్రాణులకు మేలు చేయాలన్న కోరి కున్నవాడు, విద్వాంసుడు, ప్రియదర్శ నుడు, ఆత్మ వంతుడు, కోపాన్ని స్వాధీనంలో వుంచుకున్నవాడు, ఆశ్చర్యకరమైన కాంతిగలవాడు, అసూయ లేనివాడు, రణరంగంలో దేవదానవులను గడ-గడలాడించ గలవాడు ఎవరైనా వున్నారా ఈ భూలోకంలో? అని పదహారు ప్రశ్నలు వేస్తాడు వాల్మీకి. నారదుడు ఆ ప్రశ్నలకు సమాధానం చెప్తాడు. బాల్యంలోనే శ్రీరాముడు గుహుడు లాంటి (నీచ) జాతి వారితో సహవాసం చేయడంతో, ఆయన గుణ వంతుడు అయ్యాడు. తాటకాది రాక్షసులను చంపి వీర్యవంతుడు అయ్యాడు. గురువాజ్ఞ మీరక పోవడం-జనకాజ్ఞ జవదాటక పోవడం-పరశు రాముడిని చంపక పోవడం లాంటివి ఆయన ధర్మజ్ఞుడు అని తెలుపుతాయి. అయోధ్య కాండ వృత్తాంతమంతా శ్రీరాముడిని సత్యవాది గా-దృఢవ్రతుడిగా -సచ్చరిత్రుడుగా తెలుపుతుంది. విభీషణ శర ణాగతి ద్వారా రాముడి ఆత్మవంతుడి లక్షణాన్ని బయటపెడుతుంది. ఇంద్రజిత్తుపై కోపించక పోవడం, చేజిక్కిన రావణుడిని విడిచిపెట్టడం, రాముడి జితక్రోధత్వాన్ని తెలుపుతుంది. విరోధైన రావణుడిని మెచ్చు కోవడమంటే రాముడికి అసూయలేదనే కదా. ఇలానే రాముడు కాంతియుక్తుడనీ- భయం కరుడనీ పలు సందర్భాల్లో అర్థమవుతుంది. వాల్మీకి శ్లాఘించిన గుణాలు అసమానమైనవి. ఒక్కో గుణంలో అంతర్లీనంగా ఇంకొన్ని వుండడంతో అవి అనేకమయ్యాయి. మనుష్యమాత్రులందు ఇవి కనపడవు. ఇట్టి సుగుణ సంపత్తికలవాడు, ఇక్ష్వాకుల మహారాజు వంశంలో, రామా రామా రామా, అని లోకులు పొగిడే రామచంద్రమూర్తి అనే పేరుగలాయన మాత్రమే. అతివీర్యవంతుడాయన. అసమాన మైన-వివిధమైన-విచిత్రమైన శక్తిగలవాడు. సర్వం తెలిసినవాడు. నీతే ప్రధానం ఆయనకు. పరులకు హితమైన, ప్రియమైన మాటలు చెప్తాడు. శ్రీమంతుడు. ఎవరిపై శత్రు భావం లేకపోయినా, తనను ఆశ్రయించిన వారిని ద్వేషిస్తే, వారిని నాశనం చేసే వాడు. ఎత్తైన మూపురాలున్నవాడు.



రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# విద్యార్థులు సామాజిక సేవలో భాగస్వాములవ్వాలి



కాకినాడ : సామాజిక సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావడం ద్వారా విద్యార్థులు ఈ దశ నుంచే సేవాభావాన్ని అలవరచుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ టి.అశోక్ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో బుధవారం ప్రీరిపబ్లిక్ పెరేడ్ -2017 ఎంపికలు నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని నన్నయ అనుబంధ కళాశాలల ఎన్ఎస్ఎస్ విద్యార్థులందరూ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎంపిక కార్యక్రమానికి హాజరైన విద్యార్థులనుద్దేశించి డా.అశోక్ మాట్లాడుతూ విద్యార్థులందరూ శారీరక, మానసిక దృఢత్వం కలిగి ఉండాలన్నారు. తద్వారా దేశానికి ఎక్కువ సేవలు అందించగలమన్నారు. వలంటీర్లకు ప్రత్యేక ఎంపిక బృందం ఆధ్వర్యంలో శారీరక, క్రీడల, కళల, సాహిత్యాలలో పోటీలు నిర్వహించారు. మొత్తం 192 మంది విద్యార్థులు ఈ ఎంపికలో పాల్గొనగా వివిధ పోటీలు నిర్వహించి 12 మందిని ఎంపిక చేసి ప్రీరిపబ్లిక్ డే పేరెడ్-2017కు పంపనున్నారు. వీరిలో ఆరుగురు విద్యార్థులను పూర్తిస్థాయిలో ఎంపిక చేస్తారు. ఈ ఎంపిక ప్రక్రియలో ఎన్ఎస్ఎస్ రీజినల్ డె%రెక్టర్ ఆర్.గోకుల్‌కృష్ణన్, రాష్ట్ర ప్రోగ్రామ్ అధికారి పి.రామచంద్రరావు, జిల్లా ప్రోగ్రామ్ అధికారి డా.వెంకటకృష్ణారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ సమన్వయకర్త ఎన్.కిరణ్‌చంద్ర, డా.వరహాల దొర, డా.పి.ఎల్.నారాయణ, డా.ఆర్.జానకీరామ్, రాజేంద్రప్రసాద్, ఉభయ గోదావరి జిల్లాల ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో బయోమెట్రిక్‌కు ఏర్పాట్లు

కడప : అన్ని పాఠశాలల్లో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేస్తామని బయోమెట్రిక్ రాష్ట్ర నోడల్ అధికారి దేవరాజ్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలోని డీసీఈబీ హాలులో కడప డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. బయోమెట్రిక్ యంత్రాలు, హాజరు అమలుకు ఎదురయ్యే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక నిపుణుల సహకారంతో వారి సమస్యలను పరిష్కరించే, వివిధ అంశాలపై అవగాహన పెంచే ప్రయత్నం చేశారు.

అయితే సాధారణంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు ప్రాజెక్టర్, స్క్రీన్ ఏర్పాటు చేసి వివరిస్తారనీ ప్రస్తుతం అలా చేయలేదనీ పలువురు ఉపాధ్యాయులు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా దేవరాజ్ మాట్లాడుతూ.. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 7వ తేదీ వరకూ బయోమెట్రిక్ హాజరు విధానాన్ని సమీక్షించుకునేందుకు ప్రభుత్వం షెడ్యూలు ఇచ్చిందన్నారు. సెప్టెంబర్ 2వ తేదీ వరకూ ప్రస్తుతం ఆయా పాఠశాలలకు పంపిన బయోమెట్రిక్ యంత్రాలు పని చేస్తున్నాయా, లేదా పరిశీలించడం, అప్‌డేట్ చేయించడం వంటి చర్యలు చేపడతామన్నారు. 4 నుంచి 6వ తేదీ వరకూ కొత్త యంత్రాలను ఇవ్వడం, రీప్లేస్ చేయడం వంటివి చేస్తామన్నారు. అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు బయోమెట్రిక్ యంత్రాలు అందజేశారన్నారు. వచ్చే నెల 7వ తేదీ నుంచి ఖచ్చితంగా బయోమెట్రిక్ హాజరు అమలు అయ్యేలా అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగానే ఒక్కో జిల్లాకు ఒక్కో రాష్ట్రస్థాయి నోడల్ అధికారిని ప్రభుత్వం నియమించిందని వివరించారు. కార్యక్రమంలో ఐసీటీ రాష్ట్ర రీసోర్స్‌పర్సన్ శ్రీనివాసులు, కడప డిప్యూటీ ఈవో జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు.

# 2, 3వ తేదీలలో రాష్ట్రస్థాయి సెలంబమ్ పోటీలు

కడప : కడప జిల్లాలో రాష్ట్రస్థాయి సెలంబమ్ పోటీలు సెప్టెంబర్ 2, 3వ తేదీలలో కడప నగరంలోని చంద్రమౌళీ స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెలంబమ్ అసోసియేషన్ ఛైర్మన్ వై.శివకృష్ణమూర్తి, జిల్లా అసోసియేషన్ సభ్యులు దామోదర్, వెంకటేష్, మస్తాన్ హుస్సేన్, రాజశేఖర్‌లు ప్రకటనలో తెలిపారు.

శివకృష్ణమూర్తి మాట్లాడుతూ.. కడప నగరంలో మొదటిసారి రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించుటకు ఎంతో గర్వపడుతున్నామని ఈ పోటీల్లో క్రీడాకారులందరూ పాల్గొని కడపకు మంచి పథకాలు తేవాలని కోరారు. రాష్ట్రస్థాయిలో జరిగే ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల క్రీడాకారులు పాల్గొంటారని వారికి అవసరమైన అన్ని సదుపాయాలు సమకూర్చామని ఈ సందర్భంగా తెలిపారు.

# అందరి ప్రోత్సాహంతో అర్జున

## జ్యోతి సురేఖకు ఘన స్వాగతం



తాడేపల్లి : అంతర్జాతీయ విలువిద్య క్రీడాకారిణి, అర్జున పురస్కార గ్రహీత వెన్నం జ్యోతిసురేఖకు కేఎల్ విశ్వవిద్యాలయం ఘన స్వాగతం పలికింది. విద్యార్థులు, ఆచార్యులు, గన్నవరం విమానాశ్రయం వద్దకు వెళ్లి ఆమెను వూరేగిస్తూ విశ్వవిద్యాలయానికి తీసుకొచ్చారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో జ్యోతి సురేఖ మాట్లాడుతూ అందరి ప్రోత్సాహంతోనే అర్జున దక్కిందన్నారు. తొలుత కేఎల్‌ఈఎఫ్ అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కె.రాజాహరీన్, ఉపకులపతి డాక్టర్ ఎల్‌ఎస్‌ఎస్‌రెడ్డి ఆమెకు పూల బొకేలు అందజేశారు. రాష్ట్రపతి నుంచి అర్జున పురస్కారాన్ని అందుకున్న జ్యోతిసురేఖ మరిన్ని పతకాలు తేవాలని ఆకాంక్షించారు. ఆమె తమ విద్యార్థిని కావడం గర్వంగా ఉందన్నారు.

అనంతరం జ్యోతిసురేఖ తండ్రి సురేంద్ర విలేకరులతో మాట్లాడారు. తన కుమార్తె కేఎల్‌యూలో కంప్యూటర్ ఇంజనీరింగ్ పూర్తిచేశారని, ప్రస్తుతం ఎంబీఏ ఇక్కడే కొనసాగిస్తారన్నారు. ఉపకులపతి మాట్లాతుతూ జ్యోతిసురేఖ అర్జున్ అందుకోవడం తమ విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. కాంపౌండ్ కేటగిరిలో అర్జున అవార్డు దక్కడం దక్షిణ భారతంలోనే తొలిసారన్నారు. నవ్యాంధ్రకూ అర్జున రావడం మొదటిసారన్నారు. 11వ ప్రపంచ విశ్వవిద్యాలయాల విలువిద్య ఛాంపియన్ షిప్‌లో తను బంగారు పతకం సాధించిందని, ఆమెకు వంద శాతం ఉపకార వేతనం ఇచ్చామని వెల్లడించారు.

ముఖ్యమంత్రిని కలవడం జరిగిందని, సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఆయన వెంట ఆచార్యులు డాక్టర్ హబీబుల్లాఖాన్, ఉమామహేశ్వరరావు, హరికిషోర్ తదితరులున్నారు. అక్టోబరులో సీనియర్ వరల్డ్ ఛాంపియన్ షిప్‌కు ఎంపికై, దేశానికి పతకం తేవాలన్నదే నా లక్ష్యం.

# ఏసీబీ వలలో ఆర్ అండ్ బీ ఎస్ఈ

గుంటూరు : గుంటూరు ఆర్ అండ్ బీ ఎస్ఈ (సూపిరింటెడెంట్) ఇంజనీర్ కె.వి.రాఘవేంద్రరావు నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి అక్రమ ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో రాఘవేంద్రరావుతో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ ఏసీబీ డీఎస్పీ దేవానంద శాంతో ఆధ్వర్యంలో పది ప్రత్యేక బృందాలు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో ఇప్పటివరకు ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.2కోట్ల విలువ చేసే ఆస్తులు గుర్తించినట్లు డీఎస్పీ తెలిపారు.

రాజధాని ప్రాంతంలో ఏడెకరాల పొలంతో పాటు వజ్రాభరణాలు, నగదు గుర్తించినట్లు వెల్లడించారు.

# అగ్రిగోల్డు బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం

మాచర్ల : అగ్రిగోల్డు సంస్థ బాధితులకు చివరి రూపాయి వచ్చేవరకు అండగా ఉండి పోరాడుతామని కష్టమర్లు, ఏజెంట్ల సంక్షేమ సమితి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బాధితుల చైతన్యయాత్ర మాచర్లకు చేరుకుంది. యాత్ర వాహనానికి రాయవరం కూడలి స్థానిక నేతలు, అగ్రిగోల్డు బాధితులు స్వాగతం పలికారు. పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోదండ రామాలయంలో జరిగిన సభలో ముప్పాళ్ల మాట్లాడారు. అగ్రిగోల్డు సంస్థకు గత సీఎంల నుంచి ప్రస్తుత సీఎం వరకు అప్పట్లో అండగా ఉన్నారని, వారిని చూసే సంస్థలో కొందరు డబ్బు దాచుకున్నారన్నారు. రోజుకూలి చేసే పేదలను నమ్మ బలికించి డబ్బులను డిపాజిట్ చేయించారన్నారు. ప్రస్తుత రాజకీయ నాయకుల్లో అధికార, ప్రతిపక్ష నేతలు బాధితుల తరపున న్యాయం చేసేందుకు ముందుకు రాలేదని చెప్పారు. అగ్రిగోల్డులో 13 లక్షల మంది వరకు పేదలు డబ్బును దాచుకున్నారని, వీరి పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఎందరో గుండెపోటుకు గురై, ఆత్మహత్యలు చేసుకొని మరణించారన్నారు. బాధితులకు మనోధైర్యం కల్పించడంతో పాటు సమస్య పరిష్కారమయ్యే వరకు తాము అండగా ఉంటామని చెప్పారు. బాధితుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఇ.వి.నాయుడు, కార్యదర్శి తిరపత్య, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడారు. ఏరియా కార్యదర్శి చవ్వా బాలస్వామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో వెంకటేశ్వర్లు, మిద్దెపోగు బాబురావు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించండి

## మంత్రి గంటా శ్రీనివాసరావు

చిత్తూరు : అన్ని ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు సర్వశిక్ష అభియాన్ పీవోలను ఆదేశించారు.

అమరావతి నుంచి సర్వశిక్ష అభియాన్ అధికారులతో ఆయన వీడియో సమావేశం నిర్వహించారు.

కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లోని విద్యార్థినులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించిన వారిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సత్కరించనున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమం బాలల దినోత్సవంను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. పాఠశాల విద్య కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్, సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర పథక సంచాలకులు శ్రీనివాస్ మాట్లాడుతూ సంకల్పం కార్యక్రమం ద్వారా మూడు, ఐదు, ఎనిమిదోతరగతి విద్యార్థులకు చదవడం రాయడం బాగా వచ్చే విధంగా నవంబరులోగా లక్ష్యంను పూర్తి చేయాలని ఆదేశించారు.

డీఈవో, పీవో, ఉప, మండల విద్యాశాఖాధికారులు, సెక్టోరియల్ అధికారులు ప్రతిరోజు పాఠశాలలను తనిఖీచేసి రోజువారి నివేదికను తప్పనిసరిగా అందజేయాలన్నారు. లేనిపక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి ఎస్ఎస్ఏ పీవో శామ్యూల్, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

# 15లోగా ప్రత్యామ్నాయ పంటల సాగుకు చర్యలు

## వ్యవసాయ శాఖ జేడీ విజయకుమార్

చిత్తూరు : సాగుకు నోచుకోని భూముల్లో ఈ నెల 15వ తేదీ లోగా ప్రత్యామ్నాయ పంటల సాగుకు చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు విజయకుమార్ పేర్కొన్నారు. ఆయన వ్యవసాయ శాఖ ఏడీ, ఏవోలతో చరవాణి సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సాధారణ సాగులో సుమారు 51 వేల హెక్టార్లు సాగుకు నోచుకోలేదని, ఆ భూముల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తరణకు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యామ్నాయ పంటల విస్తరణకు ఉచితంగా ఉలవలు, అలసంద, అనప తదితర విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. విత్తన కొరత లేదని అవసరమైనంతగా సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. విత్తనాలు కావలసిన అధికారులు సత్వరమే ప్రతిపాదనలు పంపితే సరఫరా చేస్తామన్నారు. మామిడి తోటల్లో కూడా ఉలవ సాగుకు జిల్లా పాలనాధికారి ప్రద్యుమ్న ఆదేశాలు జారీ చేశారని, ఆ దిశగా పంట విస్తరణకు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఉలవలతో పాటు అలసంద, ఉద్దులు, పెసలు సాగు విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఖరీఫ్ సాధారణ సాగులో లోటు ఉండరాదని, ఖాళీ భూముల్లో సైతం ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలన్నారు. అలాగే అర్హులైన రైతులందరికి పంట రుణాలు అందేలా చూడాలన్నారు. 1వ తేదీ నుంచి ఈ-పాస్(వేలిముద్ర ఆధారిత) ఆధారంగా ఎరువుల పంపిణీ ప్రారంభం కానున్నదని, ఈ విధానంపై రైతులకు తెలియజేయాలని తెలిపారు. అనంతరం వివిధ పథకాల లక్ష్యాలు, ప్రగతిపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ మనోహర్, సాంకేతిక అధికారులు ప్రవీణ్‌కుమార్, ప్రపూర్ణ, భారతి, సంగీత, సుజాత పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు పిల్లలపై నిఘా ఉంచాలి




కడప : చెడు వ్యసనాలకు బానిసలయ్యారు.. జల్సాలకు అలవాటు పడ్డారు.. జల్సాలు చేసేందుకు డబ్బులు కావాలి.. అడిగినన్ని డబ్బులు తల్లిదండ్రులు ఇవ్వరు.. ఒక వేళ ఇస్తే కారణం చెప్పాలి.. జల్సాల కంటే ఎవరూ ఇవ్వరు. ఈ తరుణంలో వారి దృష్టి దొంగతనాలపై పడింది. సులువైన మార్గంలో డబ్బులు సంపాదించడం మొదలుపెట్టారు. ద్విచక్ర వాహనాల చోరీలను ఎంచుకున్నారు. రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలకు నకిలీ తాళాలు పెట్టి దొంగలించడం మొదలు పెట్టారు. జిల్లా వ్యాప్తంగా ఐదు నెలల నుంచి చోరీలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 21 ద్విచక్ర వాహనాలను దొంగలించారు. కానీ వారి దొంగతనాలకు సీసీ కెమెరాలు చెక్ పెట్టాయి. ఓ వాహనాన్ని దొంగతనం చేస్తుండగా సీసీ కెమెరాలో దృశ్యాలు రికార్డు అయ్యాయి. వాటి ఆధారంగా పోలీసులు ఐదుగురు యువ దొంగలను పట్టుకున్నారు.

ఎస్పీ వెల్లడించిన వివరాల మేరకు.. జిల్లాలో ఇటీవల కాలంలో పలు చోట్ల తాళాలు వేసిన ద్విచక్ర వాహనాలు చోరీలకు గురవుతున్నాయి. సంబంధిత ఠాణాల్లో కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు కడప సీసీఎస్ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వాహనాల దొంగలపై నిఘా ఉంచామన్నారు. ఇటీవల కాలంలో ఓ కూడలిలో పార్కింగ్ చేసిన వాహనాన్ని దొంగలిస్తుండగా సీసీ కెమెరాలో దృశ్యాలు రికార్డు అయ్యాయి. దృశ్యాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఇదిలా ఉండగా ప్రొద్దుటూరులోని వెంకటేశ్వర పేటకు చెందిన గంధం విష్ణు (20), కడప నభీకోటకు చెందిన పోసా మధుసూదన్ (23), కడప రవీంద్రనగర్‌కు చెందిన చల్లా సుదర్శన్ (21), నభీకోటకు చెందిన చెంగల శ్రీనివాస్ (21), కడప భవానీనగర్‌కు చెందిన శివప్రసాద్ (28)లు బుధవారం కడప-రాజంపేట రోడ్డులో వెళ్తుంటే పోలీసులు వారిని ఆపి పత్రాలు అడిగారు. వారి వద్ద వాహనాలకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో అనుమానంతో వారి విచారించగా వాహనాలను దొంగతనం చేశామని ఒప్పుకున్నారు. ఈ మేరకు వారిని విచారించగా 21 వాహనాలు చోరీ చేసినట్లు చెప్పారని ఎస్పీ తెలిపారు. వీరిలో విష్ణు బీపీటీ రెండో సంవత్సరం, మధుసూదన్ డిగ్రీ చదివాడు. చల్లా సుదర్శన్ ఇంటర్మీడియట్ చదివి ఖాళీగా ఉన్నాడు. శ్రీనివాస్ ఇంటర్మీడియట్ చదివి కొరియర్ బాయ్‌గా పని చేస్తున్నాడు. శివకుమార్ ఒప్పంద ఉద్యోగిగా పని చేస్తూ జల్సాల కోసమని చోరీలకు పాల్పడ్డారు. చదువుకోవాల్సిన వయస్సులో చోరీలకు పాల్పడటం వల్ల జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఎస్పీ అన్నారు. వీరిలో ప్రధాన నిందితుడు విష్ణు అతను ఒక్కడే 14 వాహనాలను దొంగలించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) శ్రీనివాసరెడ్డి, సీసీఎస్ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, ఎస్సైలు నాగరాజు, జీవన్‌రెడ్డి, మోహన్, కుల్లాయప్ప, ఏఎస్సై నాగ మల్లయ్య, హెడ్ కానిస్టేబుల్ విశ్వనాథ్‌రెడ్డి, సతీష్‌కుమార్, రమణ, పీఆర్వీ.రాజు, కానిస్టేబుళ్లు బి.బాషా, బాలరాజు, శ్యాంప్రసాద్, ప్రభు, సుధాకర్‌రెడ్డిలు ఉన్నారు. వీరిందరిని ఎస్పీ అభినందించారు.

### పిల్లలపై నిఘా ఉంచాలి

పిల్లల తల్లిదండ్రులు పిల్లలపై నిఘా ఉంచాలని ఎస్పీ చెప్పారు. పిల్లలు ఎలా చదువుతున్నారు, రోజు కళాశాలకు వెళ్తున్నారా..? ఎవరి వెంట తిరుగుతున్నారు..? ఎన్ని గంటలకు ఇంటి వస్తున్నారు. వారు నడుపుతున్న వాహనాలు ఎవరివో తెలుసుకోవాలన్నారు. ప్రస్తుత రోజుల్లో పిల్లల నడవడికలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ముఖ్యంగా చెడు వ్యసనాలకు గురి కాకుండా చూడాలన్నారు. చెడు వ్యసనాల వల్లానే ఇలాంటి చోరీలకు పాల్పడుతుంటారని పేర్కొన్నారు. అలానే వాహన యజమానులు ప్రతి రెండేళ్లకొకసారి వాహనానికి సంబంధించి తాళం పరికరాన్ని మార్చుకోవాలి. ఎందుకంటే రెండేళ్లు దాటిన వాహనాలకు ఏ తాళం పెట్టినా వస్తుందన్నారు. అలానే ముందు చక్రానికి తాళం వేసుకునే విధంగా ఉండాలని, దుకాణాలు, పాఠశాలలు, కళాశాలలు ఇతర అన్ని వ్యాపార కూడళ్లు, రద్దీ ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని ఎస్పీ చెప్పారు. ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ విశ్వనాథ్‌రెడ్డి, కానిస్టేబుల్ బాషాలను ఎస్పీ బాబూజీ అభినందించి వారికి రివార్డు అందచేశారు.

# మిర్చి అదనపు ధర పథకం

## చేతివాటంపై పోలీసుల విచారణ

మిర్చియార్డు : కష్టాల్లో ఉన్న మిర్చి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అదనపు ధర పథకం చేతివాటంపై పోలీసులు విచారణ ప్రారంభించారు. వినుకొండ నియోజకవర్గం ఈపూరు మండలంలో మూడు గ్రామాల్లో మిర్చి పంట సాగు చేసిన రైతుల కంటే అధికంగా వందలాది మందికి సాగు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చిన వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, మిర్చి సాగు చేయకపోయినా సాగు ధ్రువీకరణ పత్రాలు తీసుకునేలా ఉద్దేశపూర్వకంగా రైతులను ప్రోత్సహించిన కమీషన్ ఏజంట్లపై నల్లపాడు ఠాణాలో కేసులు నమోదయ్యాయి. మిర్చియార్డు పాలకవర్గం ఈమేరకు అర్బన్ ఎస్పీ విజయరావుకు ఫిర్యాదు చేసింది. మిర్చి అదనపు ధర పథకం చేతివాటంపై విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరింది. దీనితో ఆయన కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయాలని నల్లపాడు పోలీసులను ఆదేశించారు. కేసులు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు. 224 మంది రైతులకు సాగు ధ్రువీకరణ పత్రాలు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు జారీ చేశారు.

ఇందులో 146 మంది రైతులు 36 మంది కమీషన్ ఏజెంట్ల వద్ద మిర్చిని విక్రయించారు. ఇందులో అయిదుగురు కమీషన్ ఏజెంట్లపై ఎక్కువసార్లు మిర్చిని విక్రయించినట్లు తేలింది. ఆ అయిదుగురు ఉద్దేశపూర్వకంగా రైతులను ప్రోత్సహించినట్లు పాలకవర్గం ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఇప్పటికే 62 మంది రైతులకు రూ.15 లక్షల మేర అదనపు ధర పథకం కింద రూ.1500లు వంతున వారి ఖాతాల్లో జమ చేశారు. పోలీసులు దర్యాప్తులో భాగంగా ముందుగా ఈ 62 మంది రైతులకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న రైతులు బెంబేలిత్తిపోయి సంబంధిత నియోజకవర్గ ప్రజాప్రతినిధిని ఆశ్రయించారు. ఆయన కాకినాడ ఎన్నికల ప్రచారంలో ఉంటే రైతులు అక్కడకు కూడా వెళ్లి వచ్చినట్లు సమాచారం.

పోలీసులు ఈపూరు మండలం తహసీల్దార్‌కు, వ్యవసాయ శాఖ జేడీఏకు ఆ మండలంలోని మూడు గ్రామాలు బుగ్గారం, చినకొండాయపాలెం, పెదకొండాయపాలెంలో ఎంత మంది రైతులు మిర్చి సాగు చేశారో వివరాలు ఇవ్వాలని పోలీసులు ఉత్తరాలు రాశారు. మిర్చి అదనపు ధర పథకం చేతివాటంపై పోలీసులు విచారణ ప్రారంభం కావడంతో ఈ వ్యవహారానికి సంబంధం ఉన్న వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల అధికారులతో పాటు కమీషన్ ఏజెంట్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి.

# చిత్రభాను

# నాకు నేనే పెద్ద అభిమానిని

**43 ఏళ్ల సుదీర్ఘ సినీ కెరీర్... పౌరాణికం, జానపదం, చారిత్రకం వంటి భిన్న నేపథ్యాలు.. 101 సినిమాలు... ఎన్నో అజరామరమైన పాత్రలు ... వెరసి తన సినీ ప్రయాణం అదుతేంగా సాగిందని అంటున్నారు బాలకృష్ణ మూసధోరణిలో అడుగులు వేయడం తనకు నచ్చదని, ప్రతిసారీ వైవిధ్యతతో ఆలోచిస్తానని అంటున్నారాయన. బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం పైసా వసూల్. పూరి జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్నారు. భవ్య క్రియేషన్స్ పతాకంపై ఆనంద్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 1న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందరరేగా బాలకృష్ణతో జరిపిన ఇంటర్వ్యూ ఇది..**

**నలభై మూడేళ్ల సినీ ప్రయాణాన్ని విశ్లేషించుకుంటే ఏమనిపిస్తుంది?**

బ్రహ్మాండంగా సాగింది. మొదట్లో నేను సినిమాల్లోకి రావడానికి నాన్న ఇష్టపడలేదు. లేదంటే ఇప్పటికీ 250 సినిమాలు పూర్తయ్యేవి. నేను నటిస్తుండగా నవ్వు సినిమాల్లోకి వస్తానంటే ఎలా ఒప్పుకుంటా అని వారించారు. చదువు పూర్తిచేసుకోమని అనేవారు. చదువుపై నాకు పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. ఆయన సినిమాలు చూస్తూ పెరగడంతో నటుడినవ్వాలని నిర?యించుకున్నాను.

**తొలినాళ్లలో నాన్నతో కలిసి చాలా సినిమాలు చేశారు. సెట్స్‌లో మీ మధ్య అనుబంధం ఎలా ఉండేది?**

ఇంట్లో తండ్రిగా మమ్మల్ని గారాబంగా చూసుకున్నా సెట్స్‌లో అడుగుపెడితే మాత్రం మా ఇద్దరి మధ్య నటుడు, దర్శకుడి అనుబంధం ఉండేది. నన్ను ప్రత్యేకంగా గౌరవించడం, దెబ్బలు తగిలినా షూటింగ్‌లకు ప్యాకప్‌లు చెప్పడాలు ఉండేవి కావు. అనురాగ దేవత సమయంలో నా కాలుకు పెద్ద గాయమైంది. ఆయన వచ్చి నన్ను చూసి వెంటనే వాడితో షూటింగ్ చేయాలి డిశ్చార్జ్ చేయండి అని డాక్టర్లతో చెప్పారు.

**గత చిత్రాలతో పోలిస్తే పైసా వసూల్‌లో చాలా హుషారుగా కనిపిస్తున్నారు? కారణమేమిటి?**

పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. తేడాసింగ్‌గా నా పాత్ర వైవిధ్యంగా ఉంటుంది. నా వయసుకు తగినట్లుగా ఈ పాత్ర ఉంటుంది. ట్రైలర్‌లో చూపించినట్లుగా కేవలం ఎంటర్‌టైన్‌మెంట్ మాత్రమే కాకుండా అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. మంచి కథ, పాత్రలు అన్ని చక్కగా కుదిరాయి. ఉప్పు, కారం, తీపి, వగరు చేదు ఇలా షడ్రుచులను మేళవించి విందు భోజనంగా పూరి జగన్నాథ్ ఈ సినిమాను తీర్చిదిద్దారు. ప్రస్తుతం ప్రేక్షకుల అభిరుచులు రోజురోజుకు మారుతున్నాయి. వేగం పెరిగిపోయింది. వాటిని అందుకోవాలంటే ప్రతి సినిమాలో వైవిధ్యత కనబరచాల్సిందే. ప్రేక్షకులు చూస్తారో లేదో అనే ఆలోచనను పక్కనపెట్టి ప్రతి సినిమా కొత్తగా చేయాలని ప్రయత్నిస్తాను.

**తేడా సింగ్‌గా మీ పాత్ర ఎలా ఉండనుంది?**

దొంగ వస్తువులను రవాణా చేసే వ్యక్తిగా కనిపిస్తాను. అతడి జీవితంలో ఎదురయ్యే సవాళ్లు, ఓ అమ్మాయితో ప్రేమాయణం ఆసక్తిని పంచుతాయి. పరిణితితో కూడిన ప్రేమకథతో పాటు వాణిజ్య హంగులన్నీ ఉన్న చిత్రమిది.

**తెరపై మీ పాత్రలు ఎక్కువగా ఆవేశపూరితంగా సాగుతాయి. నిజజీవితంలో ఎలా ఉంటారు?**

సినిమాలు తప్ప నాకు మరో ప్రపంచం తెలియదు.ఇరవై నాలుగు గంటలు వృత్తి గురించే ఆలోచిస్తాను. నటనతో ప్రేక్షకుల్ని అలరించే అవకాశం అందరికి రాదు. ఆ అదృష్టం నాకు దొరికింది. ఇంతకు మించిన త ృప్తి మరొకటి ఉండదు. మిగతా వారితో పోలిస్తే నా లైఫ్‌ట్కెస్టైల్ భిన్నంగా ఉంటుంది. ఉదయం మూడున్నరకే నిద్రలేస్తాను. రోజుకు ఇరవై నుంచి పద్దెనిమిది గంటల పాటు పనిచేస్తాను. కేవలం నాలుగు గంటల పాటే నిద్రపోతాను. అనవసరంగా కోపతాపాలు పెంచుకోవడం, కష్టాలు కొని తెచ్చుకోవడం వల్ల ఉపయోగం ఉండదని నమ్ముతాను.

**పూరి జగన్నాథ్‌తో నా కెమిస్ట్రీ బాగా కుదిరిందని ప్రచార కార్యక్రమాల్లో చెప్పారు. ఆయనతో పనిచేయడం ఎలా ఉంది?**

ఈ సినిమాలో మా ఇద్దరి అభిప్రాయాలు చాలా వరకు కుదిరాయి. పూరి జగన్నాథ్‌తో మరో సినిమా తప్పకుండా చేస్తాను. ప్రతి చిత్రానికి నాకు కొన్ని క్యాలిక్యులేషన్స్ ఉంటాయి. వాటిని ద ృష్టిలో పెట్టుకొనే సినిమాలు చేస్తాను. ఈ సినిమా విషయంలో నా ఊహలన్ని వందశాతం నిజమయ్యాయి. పూరి జగన్నాథ్ తన అనుభవన్నాంతా ఉపయోగించి సినిమాను అదుతేంగా తెరకెక్కించారు. ఈ సినిమాకు పూరి జగన్నాథ్ పేరును నేనే సూచించాను. నిర్మాత నా ఆలోచన బాగుందని అంగీకరించారు కానీ చిత్ర పరిశ్రమలో చాలా మంది ఆయన గురించి వ్యతిరేకంగా చెప్పారు. అలాంటివి నేను పట్టించుకోను. సినీ పరిశ్రమలో నాకున్న సన్నిహితులు తక్కువే. సాయికొర్రపాటితో పాటు కొద్దిమందితో మాత్రమే సన్నిహితంగా ఉంటాను. అందుకే ఏవీ పట్టించుకోకుండా పూరి జగన్నాథ్‌ను నమ్మి సినిమా చేశాను.

**ఈ సినిమాను 78 రోజుల్లోనే పూర్తిచేశామని ఆడియో వేడుకలో చెప్పారు. తక్కువ రోజుల్లో చేయాలని నిర?యించుకోవడానికి కారణమేమిటి?**

గౌతమిపుత్రశాతకర్ణి సినిమాను 79 రోజుల్లో పూర్తిచేస్తే ఈ సినిమాను 78 రోజుల్లో చిత్రీకరించాం. కె.ఎస్.రవికుమార్‌తో చేస్తున్న సినిమాకు మరో రోజు తగ్గిస్తాం. అలా ఒక్కో సినిమాకు ఒక్కో రోజు తగ్గిస్తూ పోవాలనుకుంటున్నాను. ఒకప్పుడు తక్కువ రోజుల్లోనే సినిమాలు చేసేవారు. రాత్రింబవళ్లు కష్టపడేవారు. ఇప్పుడు తక్కువ రోజులంటే భయపడిపోతున్నారు. సినీ పరిశ్రమపై ఎంతో మంది ఆధారపడివున్నారు. చాలా మందికి సినీ రంగం ఉపాధికల్పిస్తున్నది. వేగంగా సినిమాలు చేస్తే మరింత మందికి జీవనోపాధి కల్పిస్తున్నట్లవుతుందనిపించింది. ప్రతి సినిమాను తొందరగా చేయాలని నిర్ణయించుకున్నాను. సుదీర్ఘ సినీ ప్రయాణంలో జానపదం, చారిత్రకం, ఫాంటసీ ఇలా భిన్న నేపథ్యాలతో సినిమాలు చేశాను. మూసధోరణిలో సినిమాలు చేయడం నాకు నచ్చదు. నా నేచర్ అది కాదు. ప్రతిసారి కొత్త కథలు, ఆర్టిస్టులతో పనిచేయాలనుకుంటాను. చేయగల సత్తా, క్రమశిక్షణ నాన్న నుంచి వచ్చాయి. అందుకే ప్రతి సినిమాను వేగంగా పూర్తిచేస్తాను.

**ఓ యాక్షన్ సన్నివేశంలో డూప్ లేకుండా నటించారని తెలిసింది?**

డూప్ లేకుండా ఆ సన్నివేశాన్ని నేను చేస్తానని ఎవరూ ఊహించలేదు. ఆ సన్నివేశంలో కారులో నా పక్కనే కూర్చున్న శ్రియకు కూడా తెలియదు. నా మీద నమ్మకం ఉందా అని ఆమెను అడిగాను. అవునని సమాధానం చెప్పింది. ఏం చేయబోతున్నావని ఆమె అడగడం పూర్తికాకుండానే కారును రెండు పల్టీలు కొట్టించాను. దాంతో శ్రియ భయపడిపోయింది. లెజెండ్‌లో గుర్రంపై వచ్చి అద్దం పగలకొట్టే సన్నివేశాన్ని డూప్ లేకుండా చేశాను.పాత్రను ఎంజాయ్ చేస్తూ అందులోకి పరకాయ ప్రవేశం చేస్తే రిస్క్ అనే ఆలోచన రాదు.

**సినిమాలో ఏక్ పెగ్‌లా.. అంటూ గీతాన్ని ఆలపించారు? పాట పాడాలనే ఆలోచన మీదేనా?**


ఏ హీరో కూడా తన గొప్పతనాన్ని కీర్తించుకుంటూ స్వంతంగా పాటలు పాడుకోలేదు. తొలిసారి నేనే ఆ పనిచేశా. నాకు నేనే పెద్ద అభిమానిని. నాన్నే నాకు గురువు, దైవం.ఆయన తర్వాత నచ్చే మనిషి ఎవరంటే నాకు నేనే అని సమాధానం చెబుతాను. ఏది చేసినా అంకితభావం, క్రమశిక్షణతో పూర్తిచేస్తాను. నేను సంపాదించుకున్న జ్ఞానం పదిమందికి ఉపయోగపడాలని కోరుకుంటాను. సినిమా షూటింగ్‌లు లేకపోతే సాహిత్యం చదువుకుంటూ కూర్చుంటాను.సినిమాల ద్వారా తెలుగు భాషను పెంపొదించే ప్రయత్నం చేయడం ఆనందంగా ఉంది.

**నాన్న నటించిన కొంటెనవ్వు చెప్పింది... అనే పాటను రీమిక్స్ చేసినట్లున్నారు?**

గతంలో నిప్పులాంటి మనిషి సినిమాలో నాన్నగారి పాటను ఉపయోగించాం. ఆ తర్వాత ఆయన పాటను మళ్లీ ఈ సినిమాలోనే ఉపయోగించాను. డ్యాన్సుల్లో నాన్నగారిని అనుకరించడం థ్రిల్లింగ్‌గా అనిపించింది.

**మీ మనవడు దేవాన్ష్ మీరు నటించిన సినిమాల్ని చూస్తున్నాడా?**

వాడు నాకు పెద్ద ఫ్యాన్. నా పేరు తెలియదు. గోలతాత, శాతకరి? అంటూ పిలుస్తుంటాడు. నా సినిమాలు చూస్తుంటాడు, పాటలు విని నవ్వుతుంటాడు.



**కె. యస్. రవికుమార్ దర్శకత్వంలో చేయబోతున్న సినిమా సందేశాత్మక కథాంశంతో చేస్తున్నారని తెలిసింది?**

కుటుంబ బంధాలకు ప్రాధాన్యమున్న చిత్రమిది. తొలి షెడ్యూల్ పూర్తయింది. కుంభకోణంలో రెండో షెడ్యూల్ త్వరలో ప్రారంభం కానుంది. సినిమా నాన్న నటించిన గుడిగంటలు తరహాలో ఉంటుంది.

**ఎన్టీఆర్ జీవిత కథతో మీరు ఓ సినిమా చేస్తున్నట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి?**

తప్పకుండా నాన్న జీవిత కథతో సినిమా చేస్తాను. కథా చర్చలు జరుగుతున్నాయి. మరో రెండు మూడు రోజుల్లో దర్శకుడితో పాటు సినిమాకు సంబంధించిన పూర్తి వివరాల్ని వెల్లడిస్తాను.

**రాజకీయ కథాంశాలతో సినిమాలు చేసే ఆలోచన ఉందా?**

రాజకీయ కథాంశాలతో సినిమా అస్సలు చేయను. ఇతర కథల కంటే అవే నన్ను ఎక్కువగా వెతుక్కుంటూ వస్తున్నాయి.

## అప్పుడు.. ఇప్పుడు...!





మహేష్‌బాబుతో వివాహం అనంతరం సినిమాలకు ఫుల్‌స్టాప్ పెట్టారు నమ్రత. అయితే సోషల్ మీడియాలో మాత్రం చాలా చురుకుగా ఉంటున్నారామె. తరచూ ఏదో ఒక పోస్ట్ చేస్తూ మహేష్‌బాబు అభిమానులకు అందుబాటులో వుంటున్న నమ్రత తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో యువకుడిగా వున్న కృష్ణ ఫోటోతో పాటు, స్పైడర్ చిత్ర షూటింగ్‌లో విరామ సమయంలో మహేష్‌బాబు దిగిన ఫోటోలకు ఆసక్తికరమైన ఓ క్యాప్షన్‌ను జతచేసి పోస్ట్ చేశారు. అప్పుడు...ఇప్పుడూ...మా లెంజండరీ మామగారు, ఆయన అందమైన కుమారుడు అంటూ అసక్తికర వ్యాఖ్యల్ని పోస్ట్ చేసి తన భర్త మహేష్‌ని అందగాడు అంటూ నమ్రత మురిసిపోవడం ప్రస్తుతం సోషల్ మీడియాలో ఆసక్తిని కలిగిస్తున్నది. మహేష్‌బాబు ప్రస్తుతం ఎ.ఆర్.మురుగదాస్ రూపొందిస్తున్న స్పైడర్ చిత్రంలో నటిస్తున్నారు. రకుల్‌ప్రీత్‌సింగ్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. బ్యాలెన్స్‌గా వున్న పాటని ప్రస్తుతం రొమేనియాలో చిత్రీకరిస్తున్నారు.

సెప్టెంబర్ 27న చిత్రాన్ని విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నారు.

## మళ్లీ ప్రేమిస్తే...



భరత్, రుహాని శర్మ, అంగనా రాయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం మళ్ళీ ప్రేమిస్తే. రామా రీల్స్ పతాకంపై జాన్ సుధీర్‌పూదోట నిర్మిస్తున్నారు. రవి భార్గవన్ దర్శకుడు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. నిర్మాత మాట్లాడుతూ ప్రేమలో మోసపోయే ఓ యువకుడి కథ ఇది. ప్రేమికుడి విరహవేదనను హ ృదయానికి హత్తుకునేలా తెరపై ఆవిష్కరించారు దర్శకుడు రవి భార్గవన్. ప్రేమిస్తే తర్వాత భరత్ నటిస్తున్న వినూత్న ప్రేమకథా చిత్రమిది.విజయ్ కురాకుల అయిదు అదుతేమైన బాణీలను అందించారు. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెప్టెంబర్ నెలలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం అని తెలిపారు. కాశీవిశ్వనాథ్, సురేఖావాణి, సన, కోటేశ్వరరావు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ముజీబ్ మాలిక్, ఎడిటింగ్: నందమూరి హరిబాబు, సహనిర్మాత: కిరణ్ తనమాల.

## మారుతి దర్శకత్వంలో...!

రారండోయ్ వేడుక చూద్దాం తరువాత నాగచైతన్య సినిమాల ఎంపిక విషయంలో స్పీడు పెంచారు. ప్రస్తుతం యుద్ధం శరణం, సవ్యసాచి చిత్రాల్లో నటిస్తున్న ఆయన తాజాగా మరో చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. నాగచైతన్యతో ప్రేమమ్ వంటి హిట్ చిత్రాన్ని అందించిన సితారా ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత సూర్యదేవర నాగవంశీ తాజా చిత్రాన్ని నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. యువ దర్శకుడు మారుతి దర్శకత్వం వహించనున్న ఈ చిత్రం త్వరలో సెట్స్‌పైకి రానుందని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాతో పాటు శర్వానంద్ హీరోగా ఓ చిత్రాన్ని నిర్మించడానికి నిర్మాత సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సుధీర్‌వర్మ దర్శకత్వం వహిస్తారు. ఈ రెండు చిత్రాలకు సంబంధించిన పూర్తి వివరాల్ని త్వరలో తెలియజేస్తామని నిర్మాత సూర్యదేవర నాగవంశీ తెలిపారు.



## పొల్లాచ్చీలో పోరాటాలు

బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా శ్రీవాస్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్నది. పూజా హెగ్డే కథానాయిక. అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందరరేగా నిర్మాత మాట్లాడుతూ ఇటీవల రామోజీ ఫిలింసిటీలో ప్రత్యేకంగా వేసిన సెట్‌లో తొలి షెడ్యూల్ పూర్తి చేశాం. అలాగే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొన్ని కీలక సన్నివేశాల్ని చిత్రీకరించాం. దీంతో రెండు షెడ్యూళ్లు పూర్తయ్యాయి. త్వరలో పొల్లాచ్చీలో 15 రోజుల పాటు భారీ షెడ్యూల్ జరపనున్నాం. అక్కడే పీటర్ హేయిన్స్ నేత ృత్వంలో ఓ భారీ పోరాట ఘట్టాన్ని ప్లాన్ చేశాం. ఈ ఫైట్ చిత్రానికి హైలైట్‌గా నిలుస్తుంది. ప్రేక్షకులను థ్రిల్ చేసే అంశాలతో ఆద్యంతం ఆసక్తికరంగా ఈ చిత్రాన్ని దర్శకుడు శ్రీవాస్ అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. శ్రీనివాస్‌కు మరో హిట్ చిత్రంగా నిలుస్తుందన్న నమ్మకంతో వున్నాం అన్నారు. జగపతిబాబు, శరత్‌కుమార్, మీనా, వెన్నెల కిషోర్, మధు గురుస్వామి, లావణ్య ప్రకాష్, పవిత్ర లోకేష్, బ్రహ్మాజీ తదితరులు నటిస్తున్నారు.



# రెండో స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జట్లు




విజయవాడ : జిల్లా సెపక్ తక్రా సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు స్థానిక ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ స్టేడియంలో నిర్వహించిన 5వ దక్షిణ భారత అంతర్ రాష్ట్ర సెపక్ తక్రా ఛాంపియన్‌షిప్ ముగిసింది. మూడో రోజైన బుధవారం రెగు పురుషుల విభాగం ఫైనల్‌లో తమిళనాడు 21-19, 19-21, 21-13 స్కోర్ తేడాతో ఆంధ్రప్రదేశ్ జట్టుపై విజయం సాధించింది. మహిళల విభాగం ఫైనల్‌లో తెలంగాణ 21-14, 21-12 స్కోర్ తేడాతో గోవాపై గెలుపొందింది.

పురుషుల డబుల్ ఈవెంట్‌లో తమిళనాడు 21-11, 21-11 స్కోర్ తేడాతో ఆంధ్రప్రదేశ్ జట్టుపై విజయం సాధించగా.. మహిళల విభాగం ఫైనల్‌లో తెలంగాణ 21-15, 21-14 స్కోర్ తేడాతో గోవా జట్టుపై విజయం సాధించాయి. ముగింపు కార్యక్రమానికి ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, శాప్ ఇన్‌ఛార్జి ఎండీ కోమల్ కిషోర్, రాష్ట్ర ప్రభుత్వ క్రీడాధికారి, రాష్ట్ర యోగా సమన్వయకర్త పి.రవీంద్ర అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర సెపక్ తక్రా సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఏవీ రాఘవేంద్రరావు, జిల్లా సెపక్ తక్రా సంఘం అధ్యక్షుడు పువ్వాడ బాలమురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎం.ఓబుల్‌రెడ్డి, కార్యదర్శి సింహాద్రి రమేష్, వీఎంసీ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి శేఖర్, కార్పొరేటర్లు సీహెచ్‌సుజాత, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో ప్రపంచ పోలీసు, ఫైర్ గేమ్స్‌లో ఎనిమిది పతకాలు కైవసం చేసుకున్న ఎం.తులసీ చె%తన్యను అతిథులు సన్మానించి, జ్ఞాపికను బహూకరించారు.

# ముగిసిన అంతర్ పాఠశాలల రాష్ట్ర స్థాయి టీటీ టోర్నీ



విజయవాడ: జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన ఎలెవన్ స్పోర్ట్స్ రాష్ట్ర స్థాయి అంతర్ పాఠశాలల టేబుల్ టెన్నిస్ పోటీలు ముగిశాయి. జూనియర్ బాలికల టీమ్ విభాగం ఫైనల్‌లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (విజయవాడ) జట్టు 3-2 గేమ్‌ల తేడాతో ఎన్ఎస్ఎం స్కూల్ జట్టుపై విజయం సాధించగా.. బాలుర ఫైనల్‌లో ఎన్ఎస్ఎం స్కూల్ 3-2 గేమ్‌ల తేడాతో నలంద విద్యానికేతన్ జట్టుపై విజయం సాధించింది. సీనియర్ బాలికల టీమ్ విభాగం ఫైనల్‌లో లిటిల్ ఉడ్(కాకినాడ) 3-1 తేడాతో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ (విజయవాడ)పై విజయం సాధించగా.. బాలుర విభాగం ఫైనల్‌లో నలంద విద్యానికేతన్ జట్టు 3-0 గేమ్‌ల తేడాతో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ (విజయవాడ) జట్టుపై విజయం సాధించింది. జూనియర్ బాలికల వ్యక్తిగత విభాగం ఫైనల్‌లో టి.హాసిని (సెయింట్ అగస్టీయన్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల, అనంతపురం) 13-11, 11-5, 11-5 స్కోర్ తేడాతో ఎన్.దోహదవతి (ఢిల్లీ పబ్లిక్ స్కూల్, విజయవాడ)పై విజయం సాధించగా.. బాలుర విభాగం ఫైనల్‌లో ఎస్‌వీఎన్‌కృష్ణ (అక్షర ఇంటర్నేషనల్ స్కూల్, అనంతపురం) 11-6, 8-11, 11-4, 11-7 స్కోర్ తేడాతో బి.ప్రణవ్(ఢిల్లీ పబ్లిక్ స్కూల్, విజయవాడ)పై విజయం సాధించాడు. సీనియర్ బాలికల ఫైనల్‌లో ఆర్.కాజోల్ (ఎంఎస్ఆర్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల, విజయవాడ) 11-5, 9-11, 9-11, 11-7, 11-3 స్కోర్ తేడాతో నజీరాబీ నూర్ బాషా (ఎంఎస్ఆర్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల, విజయవాడ)పై విజయం సాధించగా.. బాలుర విభాగం ఫైనల్‌లో కుష్ జైన్ (నలంద విద్యానికేతన్, విజయవాడ) 12-10, 5-11, 11-4, 11-7 స్కోర్ తేడాతో బీవీఎం రోహిత్ (డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్, విజయవాడ)పై విజయం సాధించారు. బుధవారం రాత్రి జరిగిన ముగింపు సభకు రాష్ట్ర టేబుల్ టెన్నిస్ సంఘం కార్యదర్శి ఎస్ఎం సుల్తాన్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందించారు.

# ధోనికి హామీ ఇవ్వండి



న్యూఢిల్లీ: వచ్చే వన్డే వరల్డ్ కప్ వరకూ భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని ఇటీవల వ్యాఖ్యానించిన మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్.. అందుకు సంబంధించి ధోనికి భరోసా కల్పించాలంటూ జట్టు మేనేజ్‌మెంట్ కు హితవు పలికాడు. ఆ రకంగా ధోనికి హామీ ఇస్తేనే అతను మరింత స్వేచ్ఛగా ఆడటానికి వీలుంటుందని సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. ఈ మేరకు టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో సెహ్వాగ్ మరోసారి ధోనికి మద్దతుగా నిలిచాడు.

ఒకవేళ ధోని విఫలమైతే అతని స్థానాన్ని భర్తీ చేసే విషయాన్ని ఆలోచిస్తామని చీఫ్ సెలక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ చేసిన వ్యాఖ్యలను సెహ్వాగ్ తిప్పికొట్టాడు. ఎంఎస్‌కే ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు ఎంతమాత్రం సరికాదన్నాడు.

ధోని స్థానంపై భరోసా కల్పించాల్సింది టీమిండియా సెలక్టర్లేనని విషయం గుర్తుంచుకోవాలన్నాడు. భారత జట్టు టాపార్డర్ విఫలమైతే అప్పుడు ధోని ఉపయోగం కచ్చితంగా కనబడుతుంది. భారత టాపార్డర్ లో యువరాజ్, సురేశ్ రైనాల వంటి ఆటగాళ్లు విఫలమైన పక్షంలో ఆ తరువాత వచ్చే ధోని ఆదుకుంటాడు. దాన్ని చాలాసార్లు చూశాం కూడా. ప్రస్తుతం అద్భుతమైన ఫామ్ లో ఉన్న ధోని స్థానంపై జట్టు యాజమాన్యం భరోసా కల్పించాలి. 2019 వరకూ నీ స్థానం నీదే అనే హామీ ఇచ్చి ధోని మరింత స్వేచ్ఛగా ఆడటానికి దోహద పడండి'అని సెహ్వాగ్ పేర్కొన్నాడు. మరొకవైపు యువరాజ్, సురేశ్ రైనాల స్థానాన్ని కూడా సెలక్టర్లు పరిశీలించాలని సూచించాడు.

# డేరా చీఫ్‌గా గుర్మీత్ కుమారుడు?



చండీగఢ్: అత్యాచారం కేసులో డేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్ సింగ్‌కు 20 ఏళ్ల కారాగార శిక్ష పడిన నేపథ్యంలో తదుపరి చీఫ్ ఎవరన్న అంశం తెరపైకి వచ్చింది. గుర్మీత్ జైలుపాల వడంతో డేరా అధినేత్రిగా ఆయన దత్త కుమార్తె హనీప్రీత్ ఇన్సాన్‌కు బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే, గుర్మీత్ సొంత కుమారుడైన జస్మీత్‌కే బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ విషయంలో గుర్మీత్ తల్లి నసీబ్ కౌర్, భార్య హర్జీత్ కౌర్ జస్మీత్‌కు సాయం చేస్తున్నారట. త్వరలో హర్జీత్, నసీబ్‌లు గుర్మీత్‌ను కలిసి డేరా బాధ్యతలు జస్మీత్‌కు అప్పగించాల్సిందిగా కోరనున్నారట. మరోవైపు ప్రస్తుతం డేరాకు ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్న విపాసన ఇన్సాన్ డేరా అధినేత్రిగా బాధ్యతలు తీసుకునే అవకాశం కూడా కనిపిస్తోంది.

ఈ విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని డేరా నిర్వాహకులు చెప్తున్నారు. వీటికంటే ముందు గుర్మీత్‌కు న్యాయస్థానం విధించిన 20 ఏళ్ల జైలు శిక్ష విషయమై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడమే తమ ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు.

## ఈ బ్యాంకులో రుణాలపై వడ్డీ తగ్గింపు

దిల్లీ: ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) తమ ఖాతాదారులకు శుభవార్తను ప్రకటించింది. రుణాలపై వడ్డీరేట్లను 20 బేసిస్ పాయింట్లు తగ్గించింది. బ్యాంక్ రుణాలపై వడ్డీరేటును 9.35శాతం నుంచి 9.15శాతానికి తగ్గిస్తున్నాం అని బీఎస్‌ఈ ఫైలింగ్ సందర్భంగా పీఎన్‌బీ పేర్కొంది. తగ్గిన వడ్డీరేట్లు సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. అంతేగాక ఎంసీఎల్‌ఆర్ రేటును కూడా 20 నుంచి 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు బ్యాంకు తెలిపింది. ప్రస్తుతం ప్రభుత్వ రంగ అతిపెద్ద స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా.. అతి తక్కువ వడ్డీరేట్లతో రుణాలను ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ బ్యాంకులో రుణాలపై వడ్డీ 9 శాతంగా ఉంది. ఎస్‌బీఐ గత జులైలోనే ఈ వడ్డీరేట్లను తగ్గించింది.

# 7న రైతు సాధికార సంస్థ ముట్టడి




విజయవాడ : ఒకే దఫా రైతు రుణమాఫీ డిమాండ్‌తో సెప్టెంబరు 7న విజయవాడ సమీపంలోని గన్నవరం వద్ద ఉన్న రైతు సాధికార సంస్థ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టినట్టు అఖిల భారత కిసాన్‌సభ (ఏఐకేఎస్) జాతీయ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య తెలిపారు. దేశవ్యాప్తంగా రైతుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబరు 1 నుంచి 7వ తేదీ వరకు రైతాంగ డిమాండ్ల వారోత్సవాన్ని నిర్వహించాలని ఇటీవల దిల్లీలో జరిగిన ఏఐకేఎస్ సమావేశంలో తీర్మానించినట్లు గుర్తు చేశారు. ఈ సందర్భంగా హనుమాన్‌పేట సీపీఐ భవన్‌లో రైతు సాధికార సంస్థ ముట్టడి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ ప్రహసనంగా మారిందని, ఎన్నికల ముందు అన్ని రకాల రుణాలకు సంబంధించి రూ. 84వేల కోట్లను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 30 రకాల షరతులు విధించి రుణమాఫీ లక్ష్యాన్ని రూ.24వేల కోట్లకు కుదించారని విమర్శించారు. ఈ కారణంగా రైతులు తాము చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. మార్చి నెలలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మూడో విడత రుణమాఫీ ద్వారా రూ.3, 600 కోట్లను కేటాయించిన ప్రభుత్వం వాటిని విడుదల చేశారు.

## దావూద్ విషయమై ముషారఫ్
# ఘాటు వ్యాఖ్యలు



లాహోర్: అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం కోసం ఎన్నో ఏళ్లుగా భారత ప్రభుత్వం వెతుకుతోంది. అయితే దావూద్ పాకిస్థాన్‌లో ఉన్నాడని గతంలో వార్తలు వెలువడినా దీనిని ఆ దేశ ప్రభుత్వం ఖండిస్తూ వచ్చింది. తాజాగా పాక్ మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్ దావూద్ విషయమై ఓ పాకిస్థానీ ఛానెల్‌తో మాట్లాడారు. ఎంతోకాలంగా భారత్.. పాక్‌ను దూషిస్తోంది. అలాంటప్పుడు దావూద్ విషయంలో మేమెందుకు భారత్‌కి సాయం చేయాలి? దావూద్ పాకిస్థాన్‌లోనే ఎక్కడో ఒకచోట ఉండొచ్చు. భారత్ ముస్లింలను చంపేస్తోంది. ఇందుకు దావూద్ దీటుగా ప్రతిస్పందిస్తున్నాడు. అని ముషారఫ్ అన్నారు. 260 మంది ప్రాణాలను బలిగొన్న 1993 నాటి వరుస బాంబు పేలుళ్ల కేసులో దావూద్ ప్రధాన నిందితుడు. ఈ మారణకాండ తర్వాత అతను పాక్‌కు వెళ్లిపోయి... అక్కడి నుంచే నేర సామ్రాజ్యాన్ని నడుపుతున్నాడు. అయితే పాక్ ఈ విషయాన్ని ఎప్పుడూ ఖండించేది. ఇప్పుడు ముషారఫ్ దావూద్ పాక్‌లోనే ఉన్నాడని పరోక్షంగా చెప్పడంతో మరోసారి ఈ విషయం చర్చనీయాంశమైంది. దావూద్ పాక్‌లో 21 మారుపేర్లతో చెలామణి అవుతున్నట్లు బ్రిటన్ ప్రభుత్వం ఇటీవల గుర్తించింది. పాక్‌లో అతడికి మూడు చిరునామాలు కూడా ఉన్నాయని పేర్కొంది. బ్రిటన్ ఆర్థిక శాఖ తాజాగా విడుదల చేసిన ఆర్థిక ఆంక్షల జాబితాలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

# తెలుగుకు వెలుగునిద్దాం

హిందూపురం: తెలుగుకు వెలుగునిద్దామని, భాష విలువను ప్రపంచానికి చాటుదామని బిట్ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ డాక్టర్ పి.చంద్రమోహన్ పేర్కొన్నారు.

ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రమేష్ అధ్యక్షతన కళాశాలలో ఏర్పాటు చేసిన తెలుగుభాషా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. తెలుగును కాపాడు కోవాలని పిలుపు నిచ్చారు. ఎన్ఎస్ఎస్ పీఓ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

***క్రీడల్లో రాణించాలి...***

విద్యార్థులు చదువుతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఇచ్చే క్రీడల్లో రాణించాలని డాక్టర్ చంద్రమోహన్ పేర్కొన్నారు. జాతీయ క్రీడాదినోత్సవంలో ఆయన మాట్లాడుతూ ధ్యాన్‌చంద్‌ను ప్రతి విద్యార్థి స్ఫూర్తిగా తీసుకొని క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలన్నారు.

కళాశాల మైదానంలో ఛైర్మన్, అధ్యాపకులు, విద్యార్థులు వాలీబాల్ ఆడారు.

## రాష్ట్ర టీటీ పోటీల్లో సత్తా

అనంతపురం: విజయవాడలో 11 స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి అంతర్ పాఠశాలల టేబుల్ టెన్నిస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. అండర్-12 బాలికల విభాగం ట్రోఫీని నెంబర్‌వన్ సీడెడ్ క్రీడాకారిణి హాసిని అందుకుంది. బాలుర విభాగం టైటిల్‌ను కృష్ణ సొంతం చేసుకున్నాడు. అండర్-15 బాలికల విభాగంలో సాయి అమూల్య కాంస్య పతకం సాధించింది. పతకాలు సాధించిన క్రీడాకారులను పలువురు అభినందించారు.

# త్రుటిలో తప్పిన ప్రమాదం

అమరావతి: ప్రైవేటు పాఠశాల బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. మండలంలోని గలిబిపల్లికి వెళ్లే రహదారి మూడురోజులుగా కురిసిన చిరుజల్లులకు బురదమయమైంది. గ్రామానికి చెందిన విద్యార్థులను హిందూపురం ప్రైవేటు పాఠశాలకు తీసుకెళ్లేందుకు బస్సు బయల్దేరింది. మార్గమధ్యంలో బురదలో అదుపుతప్పి పక్కకు ఒరిగింది. అప్రమత్తమైన చోదకుడు విద్యార్థులను కిందకు దించేశాడు. ఆ సమయంలో బస్సులో 10మంది వరకు విద్యార్థులు ఉన్నారు. వాహనం అలాగే ముందుకెళ్లి ఉంటే పక్కనే ఉన్న నీటికుంటలో పడేదని, చోదకుడు అప్రమత్తం కావడంతో విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారని గ్రామస్థులు తెలిపారు.
స్థానికుల ఆందోళన... గ్రామానికి వెళ్లే రహదారిని పునరుద్ధరించాలని ఇప్పటికే పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఏమాత్రం ప్రయోజనం లేకుండా పోయిందని కోపోద్రిక్తులైన గ్రామస్థులందరూ లేపాక్షి-హిందూపురం ప్రధాన రహదారిపై బైఠాయించారు. తారురోడ్డు వేయాలని నినాదాలు చేశారు. స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఆందోళన విరమించమని భీష్మించారు. ఎస్ఐ శ్రీధర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వారితో మాట్లాడారు. ఫలితం లేకపోవటంతో సర్పంచి జయప్ప అక్కడికి చేరుకుని సెప్టెంబరు 4న ఎమ్మెల్యే బాలకృష్ణ వస్తున్నారని, ఆయనకు సమస్య వివరించి రహదారిని పునరిద్ధరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.




# శ్రీవారిని దర్శించుకున్న గవర్నర్ దంపతులు



తిరుమల: తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారిని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ నరసింహన్ దర్శించుకున్నారు. ఈరోజు ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో ఆలయం వద్దకువద్దకు చేరుకున్న గవర్నర్ దంపతులకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న గవర్నర్‌కు రంగనాయకుల మండపంలో అర్చకులు శేషవస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనాలు ఇచ్చారు. తితిదే అధికారులు వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి దర్శనానికి ముందు గవర్నర్ దంపతులు వరాహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



Editor : Bete Sai Trilok, Printed and Published by Bete Chandra Sekhar on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from D.No:58-3-15/1A, Atchamma Street, Patamata, Vijayawada-520 010, A.P. and Printed at **VIJAYABHANU PRESS,** D.No.9-3-17, Pithapuram Colony, Visakhapatnam -530 003, RNI No.APTEL/2008/24468, ★ e-mail: vijayabhanudaily@gmail.com